శ్రీ కృష్ణారావుగారు నిర్ణయించబడిన కార్యక్రమం ప్రకారం నవంబరు 19వ తేది ఉదయం కారులో అవనిగడ్డ నుండి బయలుదేరి మధ్యాహ్నానికి హైదరాబాదు చేరాలి. కాని ఆరోజు ఉదయాన్నే హైదరాబాదు ఇంటికి ఫోను చేసి "నా చుట్టూ ఆశ్రమం పిల్లలు ఉన్నారు. అంతా తుఫాను వస్తుందని భయపడుతున్నారు. ఈ సమయంలో గాంధీ క్షేత్రాన్ని, యీ జనాన్ని వదలిరాలేను. తుఫాను తగ్గగానే వస్తాను'' అని చెప్పారు. మరునాడు వారి రాక కోసం అంతా హైదరాబాదులో ఎదురు చూస్తున్నారు. యిక ఆక్కడి నుండి వార్తలు లేవు.

క్షణంలో గండం తప్పిన మండలి:-

19వ తేదీ మధ్యాహ్నానుండే తుఫాను గాలి, వర్షం ప్రారంభమైంది. గాంధీక్షేత్రంలోని ఆశ్రమంలోగల ప్రతి కుజీరానికి. ప్రతిచోటుకి వెళ్లి వాళ్లందరికీ ధైర్యం చెబుతూ అన్ని ఇండ్లకు మధ్యలోనున్న గాంధీ కుటీరంలో మకాం పెట్టారు. క్షణక్షణం గాలికి, వర్షానికి మహాసమరం రెచ్చిపో సాగింది. సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి ఆశ్రమ భవనాల పైకప్పులన్నీ ఎగిరిపోయాయి. రేకులు ఏమైపోతున్నాయో తెలియదు. ఎక్కడ ఏమి జరుగుతున్నదో తెలియడం లేదు.

భయంకరమైన తుఫాను హోరు మాత్రం వినబడుతున్నది. గంటకు 150 మైళ్ళ వేగంతో వస్తున్నది తుఫాను. యింతలో ప్రక్కనేవున్న ఇంటి నుండి అనాధ పిల్లల ఆక్రందనం శ్రీ మండలి చెవిన బడింది. శ్రీ మండలి ప్రమాదకరమైన ఆ తుఫానులో గదిలో దాగి ఉండలేక బైటకు వచ్చి చూచారు అనాధ పిల్లలు కొందరు తుఫానుకు భయపడిపోయి బయటికివచ్చి గాలితాకిడికి వేగంగా కొట్టుకు వస్తున్నారు. తక్షణం కృష్ణారావుగారు ప్రాణాలకు తెగించి తుఫానులోకి వెళ్లి మృత్యుముఖంలో పడిపోతున్న అనాధ బిడ్డల్ని పట్టుకున్నారు. యింతలో ఒకరిద్దరు పిల్లలు గబ గబ వచ్చి కృష్ణారావుగారిని వాటేసుకున్నారు. ఒకవైపు తుఫాను తాకిడి మరోవైపున ఆనాధ బిడ్డల బిగింపుకు తట్టుకోలేకపోయారు. కాలు తూలింది. క్రిందపడిపోయారు. అయినా వారిచేతులు ఆ బిడ్డల్ని వదలలేదు. ఆలా మరో రెండు నిమిషాలు ఆగితే మండలి, వారి ఆశ్రమంలో పెరుగుతున్న ఆ అనాధ బిడ్డలు కాలగర్భంలో కలిసిపోయేవారే. ఒక్కనిమిషంలో తెప్పరిల్లుకొని ఆ బిడ్డల్నందరిని అలాగే వాటేసుకుని నెమ్మది నెమ్మదిగా ముందుకుసాగి గాంధీ కుటీరంలోకి చేరుకున్నారు ప్రాణాలతో. గుడ్డలన్నీ తడిసి పోయాయి వర్షంలో. కాని ఆశ్చర్యం, గదిలోకి వచ్చాక వంటిమీద బట్టలు తడిసినట్లే అనిపించలేదు, ఆ 12 గంటలదాకా ఆ గాంధీ కుటీరంలో అలాగే ప్రాణాలతో వుండి ఆ అనాథ బిడ్డల్ని రక్షిస్తూ ఉన్నారు త్యాగమూర్తి శ్రీ మండలి. భళ్లున తెల్లవారింది. ఎక్కడ ఏమి జరిగిందో తెలియదు. ఎవరు ఎక్కడ వున్నారో తెలియదు. వార్తా ప్రసారాలు ఏమీలేవు. 10 గంటల వేళ ప్రాణాలు దక్కించుకొని బయటపడిన ఒక మనిషి మండలి స్వగ్రామమైన భావదేవరపల్లి నుండి పరుగెత్తుకుని వచ్చి సముద్రపు ఉప్పెనను గురించి, ఘోర విపత్తును గురించి మండలికి వార్త అందచేశారు. అవనిగడ్డలో అడుగు ముందుకు వేసేందుకు వీలులేని పరిస్థితి, తుఫాను భీభత్సం విపరీతంగా వున్నది. వెంటనే లేచి కొద్దిమంది అనుచరులతో గొడ్డళ్లు, పలుగులు, పారలు, కర్రలు వెంటతీసుకుని కాలి నడకన భావదేవరపల్లికి నడచి వెళ్ళారు 10 మైళ్ల నడక 100 మైళ్ల నడకతో సమాన

మనిపించింది. తీరా అక్కడికి పోతే జలసమాధి కంటిముందు తాండవించింది. నీరు యింకా తగ్గలేదు. జరిగిన భీభత్సం కండ్లముందు సాక్షాత్కరించింది. ఆ ఘోర విపత్తుకు మండలి గుండె కరిగిపోయింది. దుఖం పొంగిపొరలింది ఎకీ నా ప్రజలు? ఏవీ నా యిళ్లు? ఈ దివిసీమకోసం, నాతోబాటు అష్టకష్టాలు పడిన వేలాది ఆ కార్యకర్తలు ఏరి? నా వెనుక నిలబడి అహర్నిశలు కృషిచేసిన ఆ జనం ఏరీ ? ఆ నా రైతు బాంధవులు ఏరీ ? అంతా ఏమైపోయారు ? సముద్రగర్భంలో కలిసిపోయారా? అంటూ హృదయం ఆక్రోశించింది. కడుపు తరుక్కు పోయింది. ప్రపంచమంతా ఒక్క పర్యాయం అంధకారమయం అయిపోయింది. విరక్తి ఒక్కక్షణం హృదయాన్ని ఆవరించింది. కాని మరుక్షణమే ధైర్యం మనిషిని నిలబెట్టింది. నా జనం కోసం నేను నిలబడాలి. యీ కష్ట సమయంలో నేను నా ప్రజల మధ్యలోనే ఉండాలి. పోయినవారు పోగా మిగతా జనాన్ని బ్రతికించాలి. యిదే నా ధ్యేయం. యిక యీ స్థితిలో నేను మంత్రిగా నా ధర్మాన్ని నిర్వహించలేను. కష్ట సమయంలో నా ప్రజల మధ్య తిరుగుతూ వారికి అండగా ఉండితీరాలి. అందుకోసం మంత్రి పదవిలో ఉండటం ధర్మం కాదు. రెండిటికి నేను న్యాయం చేయలేను. అంటూ వారి హృదయంలో మధనం ప్రారంభమైంది. భావదేవరపల్లి గ్రామమంతా తిరిగితిరిగి దేవాలయ ప్రాంగణంలో నిలబడినప్పుడు మనస్సు ఒక నిర్ణయానికి వచ్చింది. మంత్రి పదవికి న్యాయం చేకూర్చలేను. మంత్రిగా విద్యుక్త ధర్మాన్ని నిర్వహించే సమయం ఉండదు గనుక సమయమంతా దీన జనావళి సేవకే అంకితం చేస్తాను. మంత్రి పదవికి రాజీనామా సమర్పిస్తాను అని నిర్ణయానికి వచ్చారు. యీ విధంగా తన నైతిక నిర్ణయాన్ని ప్రకటించిన త్యాగమూర్తి మండలి. వారి రాజీనామా వార్త గన్నవరం విమానాశ్రయంలో వారు దేశానికి అందించిన ఉప్పెన వార్తతో ప్రపంచమందంతట ప్రాకిపోయింది. వారి నైతిక ఋజువర్తనానికి ప్రపంచ మానవాళి చేతులెత్తి జోహారులర్పించింది.

శవవాహకుడుగా మండలి:-

దివిసీమలో ఎక్కువ భాగం శవాలతోను, మృతపశు కళేబరాలతోను నిండిపోయింది. వాటిని తొలగించేందుకు ఎవ్వరూ ముందుకురావడం లేదు. శవాలు కుళ్ళిపోతున్నాయి. కలరా వ్యాప్తమైపోయే ప్రమాదం ఏర్పడింది. చూడటానికి వచ్చేవారెవరైనా యిందుకు పూనుకుంటారేమోనని చూచారు. లాభం లేదని శవసేనను తయారుచేసి తామే శవదహనం ప్రారంభించారు. దానితో ఈ కార్యక్రమం ఆ సీమలో ముమ్మరంగా ప్రారంభమైనది. దేశం నాలుగు చెరగుల నుండి అనేక సంస్థలవారు కదలివచ్చారు. ప్రపంచమంతా ద్రవించి పోయింది. సాయం చేసేందుకు ముందుకు వచ్చింది.

ఈనాటి వరకు చేస్తున్న కృషి :-

ది.10-11-77 నుండి మండలి తుఫాను బాధితుల కోసం అహర్నిశలు పనిచేశారు, చేస్తూన్నారు. వారితోబాటు వారి సతీమణి, నలుగురు బిడ్డలు కూడా విరామ మెరుగరు. ఆరోగ్యం దెబ్బతిన్నా, పాదాలకు ఆపరేషన్ జరిగినా, గెడ్డం పెరిగిపోయినా లక్ష్యం చేయకుండా మానవ సేవకు అంకితం అయిపోయారు మండలి. తుఫాను దెబ్బ తిన్న ప్రాంతాలను తిరిగి కళ కళ లాడేలా చేయాలి. ఉరూరా గట్టి భవనాలు నిర్మాణం కావాలి. భారతావనికి ఆదర్శవంతంగా వుండేలా గ్రామాల నిర్మాణం జరగాలి. రాత్రింబవళ్ళు యిదే తపన అదే ఆలోచన.

జీవితంలో రెండు తృప్తులు :-

మండలి జీవితంలో రెండు మహత్తరమైన ఘట్టాల జరిగాయి. ఒకటి ప్రపంచ తెలుగు మహా సభలు జరి ప్రపంచంలోను; భారతదేశంలోను ఎక్కడెక్కడోవున్న తెలుగువాళ్ళ నందరినీ ప్రపంచ స్థాయిలో ఒక చోటుకి ఒక వేదికమీదకు చేర్చి తెలుగువారిలో సమైక్యతా భావ సాధించేందుకు కృషిచేశారు. అందు విజయం సాధించారు ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ ప్రజలందరి మన్ననల నందుకొన్నాయి. మండలి జీవితానికి యిది ఒక గొప్ప తృప్తి. యిక రెండవది,

దివిసీమలో జరిగిన మహాప్రళయం. ఆ సమయంలో తనప్రజల మధ్య ఉండటం, కష్టసమయంలో ఆర్తులమధ్య వుండి వారికి ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పించేందుకు కృషిచేసే అవకాశం లభించడం, కనీవిని ఎరుగని ఉప్పెనకు గురైపోయిన ప్రాంతాల దీనగాధను ప్రపంచానికంతకు తెలియజేసి విశ్వాత్మను కదిలించే అవకాశం లభించడం వారి హృదయానికి కలిగిన మరోతృప్తి.

మానవతా వాదిగా, త్యాగమూర్తిగా, సేవానిరతికి దీనజనావళి సేవకు అంకితమైపోయిన మండలికి జోహారులు.

విరామ మెరుగని సంఘ సేవకుడు
శ్రీ కాశీనాధుని పూర్ణమల్లిఖార్జునుడు

నహికశ్చిత్ క్షణమపి జాతుతిష్ఠత్య
కర్మకృత్! కార్యతే హ్యవశః కర్మ
సర్వః ప్రకృతిజైః ర్గుణై : —

ఇది శ్రీమద్భగవద్గీతలోని మూడవ అధ్యాయములోని ఐదవ శ్లోకము. దీని తాత్పర్యమేమనగా- ఏదోకర్మ చేయకుండా మానవుడు ఒక్కక్షణము కూడ ఉండజాలడు. ప్రకృతి జన్యములైన గుణములచే ఈ కర్మ చేయబడుచున్నది. మానవునిలో కర్మచేసే కరణములు మూడు. అవి మనస్సు, వాక్కు, శరీరము. జాగ్రదవస్థలో మానవుడు ఉన్నంతవరకు మనస్సు ఏదో రకమైన ఆలోచన చేస్తూనే ఉంటుంది. ఇది మానసిక కర్మ. కర్మ అనగా పని. ఆలోచన కూడ ఒక కర్మయే. అటులనే వాక్కుకూడ పనిచేస్తూ వుంటుంది. గాఢ నిద్రా సమయములో మాత్రము ఈ మనస్సు వాక్కు పనిచేయవు. జాగ్రదావస్థలో పనిచేయు చుండును. శరీరము కూడ కర్మేంద్రియముల ద్వారా జాగ్రదవస్తలో పనిచేయుచుండును. స్వప్న సుషుప్త్యవస్తలలో మాత్రము పనిచేయునట్లు కనబడును. అయితే

శరీరావయవములైన హృదయము మొదలగునవి నిరంతరము పనిచేయు చుండును. వాటికి విరామము లేదు. వానికి విరామమనగా మరణమే.

గీతాశాస్త్రము కర్మయోగమును బోధించుచున్నది. కర్మ జ్యాయో హ్యకర్మణః, అని ఘంటా ఘోషముగా చాటుచున్నది. అనగా కర్మ చేయకుండుట కంటె కర్మ చేయడమే మేలు. సిద్ధులైన పురుషులకు కూడా లోకసంగ్రహర్ధమై కర్మ చెప్పబడినది. సాధికులకు విధిగా కర్మ బోధింపబడినది. ఆ కర్మ ఏ విధముగా చేయవలెనంటే ఫలాపేక్ష లేక చేయవలసియున్నది. దానినే ''కర్మణ్యేకాధి కారస్తే మాఫలేషుక వాచన'' అని గీత ముక్తకంఠముతో చెప్పుచున్నది.

అయితే ఎటువంటి ఖర్మను గీతాశాస్త్రము బోధించుచున్నది. అనే విషయము చింతనీయము. ఏకర్మ చేసినను ఫలాపేక్ష లేకుండా, ఫలమును ఈశ్వరునికి అర్పించి నిష్కామ బుద్దితో చేయవలెను. కామ్య ఫలముల వల్ల పరమమైన ప్రయోజనము సిద్ధించజాలదు. అందువలన కొన్ని లాభములు కర్మ చేయువారికిని యితరులకును కలుగవచ్చును. కాని కర్మచేయువాడు కృతార్థుడు కావలెనన్నచో అతనికి పాపములు అంటకుండ నుండవలెనన్నచో ఫలాసక్తి లేనట్టియు ఈశ్వరార్పణ బుద్ధితో చేసినట్టి యీ కర్మలనే చేయవలసి యుండును.

''బ్రహ్మణ్యాధాయ కర్మాణి
సంజంత్యక్త్వా కరోతియః
విప్యతే న సపా పేన
పద్మ పత్రమి వాంన్భసా''

అని గీత ఉద్ఘోషించుచున్నది. ఎవడైతే సంఘమును విడిచి ఈశ్వరుని యందు అర్పించి కర్మలను చేయునో తామరాకు పైన నీరు ఎటుల అంటుకొనదో పాపములు అతనిని అంటుకొనవు అని పై శ్లోకార్ధము. ఎపుడైతే ఆవిధమైన భావముతో కర్మచేయునో ఆతడు ఎప్పుడునూ చెడ్డ పని చేయడు. సత్కర్మలనే ఆచరించును. సత్యగుణ ప్రధానుడై యుండును. ఏకర్మ చేసినను లోకసంగ్రహర్ధమై చేయును అయితే శరీరయాత్ర కొరకు కొన్ని కర్మలు చేయకతప్పదు పైన చెప్పిన

భావనతో కర్మ చేసినయెడల శరీర యాత్రకై చేసిన కర్మలలో దోషములున్నను అతనికి అంటవు.

మన మండలి వెంకటకృష్ణారావు గారు నిరంతరం కర్మచేయు కర్మయోగి అని చెప్పవచ్చును. ఆయన సాధకుడు కర్మచేయుటలో దోషములు ఉండవచ్చును. కాని ఆకర్మల వెనుకనున్న భావము ప్రధానమైనది. ఆకర్మ యొక్క పరమార్ధము పరోపకారమైన యెడల కర్మాచరణములోని దోషములు భాధకములు కాజాలవు. నేను ఆ కృష్ణారావు గారిని ఆయన విద్యార్థి దశ నుండియు ఎరుగుదును. ఒక్కక్షణము గాని వృథాగా కాలము గడిపే స్వభావము ఆయనకు లేదు. ఏదో విధమైన మానవ సేవ చేస్తూ యుండవలసిందే.

ముఖ్యంగా 1977 సంవత్సరములో వచ్చిన భయంకర తుఫాను భీభత్సము సంభవించినప్పుడు ఎవరునూ సాహసించని పరిస్థితిలో ఆయన మంత్రి పదవిలో వుండియు ఒక సైనికునివలె కార్యరంగములో దూకి, తన శరీరమునకు గాని, మనస్సునకు గాని సంభవించే కష్టముల లెక్క సేయక ఆయన చేసిన సేవ వర్ణనాతీతము. పొదలు కాని కంచెలు కాని, ముండ్లకంపలు గాని, బురద గాని, శవముల నుండి వచ్చే దుర్వాసన గాని, నడచిపోవుటకు వీలులేని కంఠక మార్గములు గాని, ఆయన కార్యదీక్షతను భంగపరచలేదు. తుఫాను సంభవించిన కొద్దిరోజులలోనే దివిసీమలో ఆయన కార్యరంగములో కొందరు మిత్రులతో కలసి అష్టకష్టముల కోర్చి పనిచేయుట నేను స్వయముగా చూచాను. నాకు అత్యాశ్చర్యము కలిగినది. అట్టి పరిస్థితులలో ఆవిధముగా పనిచేసిన వారిని నేను ఎక్కడా చూడలేదు. కొంతమంది ఉత్సాహముతో పని ప్రారంభించినను కష్టములను సహించలేక మధ్యలో విరమిస్తారు. కొందరు పనిలో ఉండే బాధలను ఊహించి అసలు పనియే ప్రారంభించరు. మన కృష్ణారావు గారు అట్లుగాక ఆరంభించిన పనిని, ఎన్ని, ఎటువంటి కష్టములు వచ్చినను లెక్కసేయక కొనసాగించి లక్ష్యమును జేరుకొందురు. కష్టమలు ఎంతగా వస్తే, అంతగా ఉత్సాహమును పెంచుకొని పని ముగించే కార్యదీక్ష ఆయనది. భర్తృహరి మహాకవి చెప్పినట్లు -

''ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై

ఆరంభించి పరిత్యజింతురు విఘ్నాయత్తు లై మధ్యముల్
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు కదా ప్రజ్ఞా నిధుల్ కావునన్''

మన కృష్ణారావు గారు ధీరుడు ప్రజ్ఞానిధి కార్య శూరుడు ఆయన తుఫాను వచ్చినప్పుడు చేసిన సేవకు గుర్తింపుగా మాన్య ప్రభాకర్‌జీ పేరుగల బహుమానమును ఆయనకు యిచ్చినందులకు ఆంధ్రప్రదేశ మంతయు ఆనందించి గర్వింప దగినది. నిజముగా ఆయన స్థాయిని యీ బహుమానము పెంచేదిలేదు. బహుమానమిచ్చినను యివ్వకున్నను తన సేవా కార్యములను నిరంతరము చేయు స్వభావము ఆయినది. ఆయన ప్రకృతియే సేవాకృత్యము. ఆయన విరామమెరుగని సంఘసేవా పరాయణుడు.

అభినందన

మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి

ప్రజల వరివశ్యతో మంత్రి పదవి నందె
పదవి యందుండియుఁ బ్రజాసపర్య చేసే;
ప్రజల సేవకై పదవిని వదలుకొనియె;
నెవ్వఁ డాతండు మండలి కృష్ణరావు.

మానవతామూర్తి శ్రీ మండలి

తిరుమల రామచంద్ర

సరిగా ఇరవై యేడు నెలల మాట. తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. ఆనాడు శనివారం 1977 నవంబరు 19. సూర్యుడు అనుదినమూ ఉదయించినట్లే ఆ దినము ఉదయించాడు. ప్రజలు నిత్యకృత్యాలు యథావిధిగానే సాగించారు. కాని ఒకటే భేదం. తుఫాను సూచనలున్నాయి సుమా! జాగరుకతతో మెలగాలి సుమా! అని వాతావరణ వేత్తలు హెచ్చరికలు చేశారు. సరే, ఎప్పుడూ ఉన్నవే ఈ తుఫానులు, ఎన్నో వచ్చాయి. నిలువదొక్కుకున్నాము. ఇది కొంచెం తీవ్రమైనదేమో! ధైర్యంతో నిలబడదాము. అంతకన్నా ఏం చేయగలం? - అనుకున్నారు దివిసీమ వాసులు. పాపం! వాళ్లకేమి తెలుసు వంద సంవత్సరాల క్రితం మచిలీపట్టణాన్ని ముంచెత్తి, వేలకొలది ప్రజలను పొట్టన పెట్టుకొన్న ఉప్పెన కన్నా పెద్దజలప్రళయం తమపై వికటాట్టహాసంతో విరుచుకొని పడుతుందని, తమను నామరూపాలు లేకుండా చేస్తుందనీని? కొన్ని గంటలలో అంతా సమాప్తమయింది. సముద్రుడు ఎందుకు ఆగ్రహించాడో, అమాయిక ప్రజలను అకారణంగా ఎందుకు దండించాడో తెలియదు.

కాని, ఇలాటి క్లిష్ట సమయాలలోనే నిత్యసత్యాలు పునర్నిరూపితం అవుతాయి. అగ్గిలో పడితేగాని అపరంజి ఏదో తెలియదు తదా! మనస్వీకార్యార్థ నగణయాతి దుఃఖం నచ సుఖం-అన్నభర్తృహరిసూక్తి మరొకమారు దేశమంతటా మారు మ్రోగింది. ఆ సూక్తికి మానవతా రూపమే శ్రీ మండలి వెంకటకృష్ణారావు.

శ్రీ మండలి తుఫాను సంభవించిననాడు కాకతాళీయంగా అవనిగడ్డలో ఉన్నారు. అప్పుడాయన చేసిన సేవ సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఆయనలోని మానవత్వం వేయి మత్తగజాల బలంతో ఉప్పెనకన్నా ఉవ్వెత్తున లేచింది. గంటకు రెండువందల కిలోమీటర్ల వేగంతో వీచే పెనుగాలులలోను ఆయన హిందీ

విద్యాలయంలోని పిల్లలేమయ్యారో! సేవాశ్రమము, ఆనాథ శరణాలయం పరిస్థితి యేమిటో!- అని విలపిస్తూ పరుగెత్తారు, వారిని దక్కించుకొందామని. తెల్లవారింది. ఉప్పెన రాక్షసి ఎందరో ప్రజలను, ఎన్నో పశువులను సమూలంగా మింగిందని వార్తలు వ్యాపించాయి. ఒంటిమీద గుడ్డలున్నాయా, లేదా అన్నది కూడ పట్టించుకోకుండా బయలుదేరారు, పాదచారియై, కూలిపోయిన ఇండ్ల మధ్యన నడిచారు. పీనుగుల పెంట మధ్యన నడిచారు చచ్చిపడిన పశువుల మధ్యన నడిచారు రాయిరప్ప, ముళ్లు వేళ్లు లెక్కచేయకుండా నడిచారు. తమ ఆరోగ్యం బాగలేక పోయినా, నడిచారు జలప్రళయంలో మరుగయిపోయినవారు పోగా, మిగిలిన వారి మనసులలో బలం నింపడానికి నడిచారు. ప్రజల హృదయాలలోనే నడిచారంటే సరిపోతుంది, ఒక్కమాటలో.

అంతటితో ఆగలేదు ఆయన. కనివిని యెరుగని ఈ ఘోరకలి ప్రభుత్వానికి తెలియాలి. ప్రభుత్వం సహాయ కార్యక్రమం వెంటనే ప్రారంభించాలి. త్వరగా చేరడానికి తగిన వాహనము లేదు.

అతికష్టం మీద వారు విజయవాడకు వెళ్ళారు హుటాహుటిగా. ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించారు. కాలిలో దాదాపు 36 ముళ్లు గుచ్చుకొన్నాయి. ఐనా, లక్ష్యపెట్టలేదు. కాలికి కట్టుకట్టించుకొన్నారు. నడక ప్రారంభించారు; విరామమెరుగని నడక. పల్లె పల్లెకు తిరిగారు. పరిస్థితి చూచారు, పరితపించారు, పరితాపం పోగొట్టారు, చొరరాని ప్రాంతాలను హెలీకాప్టరు ద్వారా పరిశీలించారు.

ఈ సమాశ్వాసన యాత్రలో, ఈ సహాయ సేవాయాత్రలో ఆయన చూడని పల్లె లేదు. ఆయన మాట్లాడని మనిషిలేడు. ఆయన ఎన్నికల ప్రచారోద్యమంలో ఎన్నో మార్లు గ్రామాలు తిరిగారు. ఆ పర్యటనల పద్ధతివేరు, ఉద్దేశం వేరు. ఈ యాత్ర అట్టిదికాదు, విషాదయాత్ర, పరామర్శ యాత్ర, పునరుజ్జీవన యాత్ర. ఇలా తుఫానుకు గురి అయిన ప్రాంతాన్నంతా కాలికి బలపం కట్టుకుని తిరిగారన్న సామెతగా పలుమారు తిరిగారు. ప్రజలలో విశ్వాసాన్ని నింపారు. విషాదయోగం

వలదన్నారు. ఇప్పుడు కావలసింది పునరుజ్జీవన పునర్నిర్మాణాలని ఉత్సాహ పరిచారు. తత్క్షణమే చేయదగిన సహాయం. సహకారం చేశారు; చేయించారు.

అవనిగడ్డలో తుఫాను బాధితులు శిబిరమైంది ఆయన మకాం. వేలకొలది తుఫాను బాధితులు ఆహమహమికతో ఆత్రంగా, ఆశతో తోసుకొని వచ్చారు శిబిరానికి. తుఫాను బాధితులకు సహాయపడుదామని వచ్చే ప్రతివారికీ ఆ శిబిరమొక పర్యాటక కేంద్రమయింది, యాత్రాస్థలమైంది. శ్రీ మండలి నిర్విరామ కృషివల్ల వందలకొలది స్వచ్ఛంద సేవా సంస్థలు ఉరుకులు పరుగులతో వచ్చాయి, ఆహారం, వస్త్రాలు అపారంగా అందజేశాయి. ఆయన చిత్తశుద్ధిని, అక్కడి హృదయ విదారక పరిస్థితిని చూచిన వందలకొలది సేవా సంఘాలు చురుకుగా పని ప్రారంభించాయి. ఎటు చూచినా కనిపిస్తూ, ఎవరిని చూచినా పలుకరిస్తూ, ఏమి కోరినా అందజేస్తూ పరమాణువులోని పరమ సూక్ష్మాంశాంలాగ తిరుగుతున్న శ్రీ సేవోత్సాహాలు మూర్తీభవించిన శ్రీ మండలి ఆ సేవాసంఘాలకు రెట్టింపు, మూడు రెట్లు ఉత్సాహావేశాలు పోశారు. ఎక్కడ చూచినా, ఇందుగలడందు లేడనే సూక్తిలాగ ఆయననే కనిపిస్తూ సేవచేశారు. ఆయన వ్యక్తిత్వం అలాటిది. కనుకనే రాష్ట్రపతి మొదలు నడివీధిలో నడిచే మనిషివరకు, దేశంలోని సంఘ సేవాసంస్థలు మొదలు అంతర్జాతీయ సంస్థల వరకు, స్థానిక పత్రికలు మొదలు అంతర్జాతీయ పత్రికల వరకు ఆయన సేవానిరతి ప్రశంసలే. 1977 నవంబరు 19 నుంచి నేటివరకు ఆయన నిరంతరం పనిచేస్తూనే ఉన్నారు. తుఫాను బాధితులను ఒక కంట కనిపెడుతూ, వారి బాగోగులు చూస్తూనే ఉన్నారు.

ఆ సేవాతత్పరత, చిత్తశుద్ధి శ్రీ మండలి అంతర్జాతీయ ఖ్యాతిని పెంపొందించాయి. 1977 సంవత్సరపు మానవతామూర్తిగా ఆయన కీర్తితులయ్యారు. మత ప్రచారకులు, సర్వోదయ కార్యకర్తలు, సంఘ సేవా పరాయణులు - ఇంతెందుకు, తఫాను భీభత్సం తెలిసిన ప్రతివ్యక్తి, మత, వర్గ, కుల, రాజకీయ సిద్ధాంతాల భేదం లేకుండా ఆయనను ప్రశంశించారు. ఆయన బద్ద

శత్రువులు గూడ ఆయనను కొనియాడక తప్పలేదు. మాసిన గడ్డంతో, బెదురు చూపులతో, మూర్తీభవించిన విషాదంలాగ ఉన్న ఆయన బొమ్మను దేశవిదేశాలలో దూరదర్శినిలో చూచిన వారికి ఉప్పెనవల్ల ఉప్పతిల్లిన ఘోర నష్టం నిజంగా ఎంతో ఆయన మాటలవల్ల, వివరణలవల్ల తెలిసింది. క్షణంలో ఎంతటి మానవ సమూహం మడిసిందో తెలిసింది. ఉపకార చింతగలవారికి, సంఘ సేవా సంస్థలకు సహాయబుద్ధి సహజంగానే కలిగింది. దేశవిదేశాలలోని సంస్థలు ఆయనకు బాసటగా నిలిచాయి. నేడు దివిసీమలో పెక్కు సంస్థలు. వ్యక్తులు నిరాశ్రయులైన ప్రజలకు ఆశ్రయాలు కల్పంచాయంటే. తక్కిన సహాయ కార్యక్రమాలు జరిపి సేవ చేయగలిగాయంటె, ఇదంతా శ్రీ మండలి కృషి ఫలితమేనని, ఇతరుల సానుభూతి సహాయ్యాలను పొందటానికి ఆయన పడిన పాట్లేనని ప్రతివారు గ్రహించగలరు. దివిసీమకు వెళ్లిన ప్రతివారు, దేశీయులైనా విదేశీయులైనా ఆయనను చూచి, ఆయన ద్వారా తమ సేవలు వెల్లడించుకోవాలని ఉవ్విళ్ళూరారు. అలా అయితే, తమ సహాయం సక్రమంగా, సరిగా, సకాలానికి ప్రజలకు అందగలదని వారు విశ్వసించారు, ఆవిశ్వాసం నెలకొల్పుకున్నారు శ్రీ మండలి.

పూర్వం కాటయవేముడు ఆది వరాహమూర్తివలె దివిసీమను ఉద్ధరించినట్లు చెబుతున్నది. ఈనాడు శ్రీ మండలి తుఫాను సమయంలో మెరునగ ధీరుడుగా నిలిచి ప్రజలను ఆదుకున్నారు. సేవాశ్రమంలో తుఫానుగాలికి కొట్టుకొని పోతున్న పిల్లలను రక్షించారు. భాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో పక్కా ఇండ్లు నిర్మించే పథకం అమలు పరచడంలో అలసట యెరుగక పాటు పడ్డారు. ఆయన ఉత్సాహ ప్రోత్సాహాలు స్వచ్ఛంద సేవా సంస్థలు దివిసీమలో కృషి చేయడానికి, విజయవంతంగా పనిని నిర్వహించడానికి పాథేయాలయ్యాయి.

శ్రీ మండలి ధైర్యసాహసాలు పెనవేసుకొన్న రాజనీతిజ్ఞుడు. సోషలిజానికి అంకితులైన సిద్ధాంతవాది. ఉపజ్ఞగల వ్యవస్థాపకుడు. విశ్రాంతి యెట్టిదో తెలియని కార్యకర్త. ఒక్క మాటలో ప్రజల మనిషి, మానవతామూర్తి. నిరాడంబరత, సర్వ

సులభత ఆయనకు గాంధీ మార్గం వల్ల అబ్బిన గుణాలు. బీదబిక్కి శత్రువు మిత్రుడు ఆయనకు ఎప్పుడుబడితే అప్పుడు ఎక్కడబడితే అక్కడ చూడవచ్చు, చెప్పవచ్చు, వినవచ్చు, తగిన మేలు పొందవచ్చు. నిజజీవితం విషయంలోను. సంఘ, ప్రభుత్వ విషయాలలోను ఆయన పూర్తిగా గాంధీతత్త్వవాది - మనసా వాచా కర్మణా గాంధీతత్త్వవాది.

గాంధీజీ ప్రబోధాలు పత్రికలలో పఠించి బెజవాడలోను, బొంబాయిలోను గాంధీని దర్శించి ఉత్తేజితులై కార్యరంగంలో దూకారు. విధానసభ సభ్యులుగా, లోక్ సభ సభ్యులుగా, మంత్రిగా చిరస్మరణీయ సేవ చేశారు. విద్యామంత్రిగా ఉన్నప్పుడు చేసిన సేవ ఆయనకు చిరకీర్తి సంపాదించింది. ప్రపంచ తెలుగు మహాసభను అత్యద్భుతంగ నిర్వహించారు. కార్యనిర్వాహకాధక్షులుగా, రాత్రింబవళ్ళు పనిచేసి తెలుగుజాతి చరిత్రలో అనొక మహత్తర సంఘటనగా ముద్రవేశారు. మాటలకన్న చేతలకే ప్రాధాన్యమిచ్చే గాంధీ సిద్ధాంత విశ్వాసి గనుక గాంధీజీ శతజయంతి నాడు ఆవనిగడ్డలో గాంధీక్షేత్ర నిర్మాణము ప్రారంభించి దానిని మహాసంస్థగా రూపొందించారు. ఉప్పెనలో సర్వస్వమూ కోల్పోయిన 400 మంది పిల్లలకు గాంధీక్షేత్రంలోని సేవాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వారికి ఉపాధికల్పన కుట్టుమిషన్ సెంటర్, బట్టల కట్టింగు ట్రయినింగు; స్త్రీ సంక్షిప్త విద్యాకేంద్రము, ఆశ్రమ పాఠశాల, గాంధీ గురుకులం, హిందీప్రచార విద్యాలయము, మహావిద్యాలయం మున్నగు అనేక సంస్థలు నెలకొల్పారు 80 వయోజన పాఠశాలలు స్థాపించారు. సర్వోదయ కార్యకర్తల, సంఘ సేవకుల సభలు జరిపారు. దక్షిణభారత నిర్మాణ కార్యకర్తల మహాసభలు నిర్వహించి గాంధీక్షేత్ర విశిష్టతను భారతదేశ వ్యాప్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల సంఘసేవకుల మహాసభలు జరిపి రాష్ట్రస్థాయి సంస్థను స్థాపించి స్వచ్ఛంద సేవలో సమన్వయ కృషికి తోడ్పాడ్డాడు. ప్రపంచ హిందీ మహాసభ సందర్భంగా భారత ప్రతినిధిగా మారిషన్‌కు వెళ్ళి అక్కడి ప్రధాని శ్రీరాం గులాంను కలుసుకొని, మారిషన్ తెలుగు

వానికి ఆంధ్రప్రదేశ్‌కు సదవగాహన కల్పించారు. రాష్ట్ర సమైక్యానికి పెట్టనికోటగా నిలబడ్డారు.

దేశపురోభివృద్ధి స్వచ్ఛంద సేవకుల మీదే ఆధారపడి ఉందని శ్రీ మండలి విశ్వాసం. ఆవిశ్వాసానికి కార్యరూపం ఇస్తున్న ఆదర్శ సంఘ సేవకుడు ఆయన ఇలాంటి శ్రీ మండలిని ఉత్తమ సంఘసేవకునిగా నిర్ణయించి ప్రభాకర్‌జీ మెమోరియల్ ఆవార్డుతో సన్మానిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల, సమాజ సేవకుల సంఘాన్ని ప్రశంసిస్తున్నాను. శ్రీ మండలి వెంకటకృష్ణారావును హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

మండలి ఒక మహాయంత్రం - గాంధీ క్షేత్రం ఒకమహానిర్మాణం

శ్రీ జోస్యుల సూర్య నారాయణమూర్తి

''ఫలాను మేయాః ప్రారంభా స్సంస్కారాః ప్రాక్తనా ఇవ'' అని కాళిదాసన్నట్లు శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు ఏపని ఎప్పుడు ఎలా ఎందుకు ప్రారంభించారో తెలుసుకోవటం కష్టం. దాని ఫలితంగా రూపుకట్టి ప్రత్యక్షమవుతున్న వస్తువును బట్టి అది ఊహించవలసిందే. ఇది ఒక అవ్యక్త ప్రాక్తన సంస్కారమే.

ఈనాడు గాంధీక్షేత్రంలో ఒక కార్యక్రమం జరుగుతుందనే సంగతి చాల తక్కువ వ్యవధిలోనే తెలుస్తుంది. ఎందుకో తెలియదు. అది అతిసామాన్య విషయంగా కనిపిస్తుంది. అనవసరమని కూడ కొందరి కనిపిస్తే ఆశ్చర్యం లేదు. సామాన్య సమావేశంలా ప్రారంభమవుతుంది. నిజానికది మహాప్రణాళికగా రూపొందనై ఉందనిపించదు. ఒక ఆలోచన కలిగించి మరీ విడిచిపెడుతుందా సమావేశం సామాజికుల్ని, ఏదో పని జరుగుతు ఉంటుంది. ఏమీ తోచక ఏదోచేస్తున్నట్టటుంది. కొన్నాళ్లలో ఆదొక మహానిర్మాణమై కూర్చుంటుంది. ఆందులో ఏదో సంస్థ పనిచేస్తూ ఉంటుంది. దానిపనది చేసుకుంటుంది. ఇదంత యేమిటి? ఒక హృదయంలో ఒక మెరుపు మెరిసి మనసు కందితే ఆ మనస్సు ఆ వెలుతురుతో అనేక క్రియాత్మక శక్తుల్ని వెతికి. పైకితీస్తుంది యంత్రాని కందిస్తుంది ఆయంత్రం పనిచేస్తుంది. ఆయంత్రమే మండలి మహాయంత్రం. ఈ యంత్రాన్ని సంకల్పశుద్ధితో కూడిన హృదయం నందిస్తున్న సంగతినే ఫలానుమేయ మంటున్నాను.

విద్యార్థి దశనుంచీ ఆయన క్రియాశీలి. పత్రికనడపడం మొదలుకొని అనేక ఉద్యమాలు తన కార్యక్షేత్రంలో ప్రతిబించింప చేసుకొన్న వ్యక్తిత్వం ఆయనది, ఆయన రాజకీయవాది- ''రాజకీయ యోగి'' అనటం సమంజసమేమో! ఆక్షేత్రం ఆయనకొక కర్మయోగసాధన క్షేత్రం కనక. ఆయన ... భోక్త ఆయనిమాత్రమే కాదు,

ఆయన క్షేత్రంలో భోక్త పలువురు. ''Live anb let live'' అనేది పాశ్చాత్య మహోన్నత భావం అంటారు భారతీయ భావన ఇంతటితో పరిమితం కాలేదు. ''Live for others'' అన్న ఔన్నత్యాన్నందుకుంది. ఈ భావ క్రియాక్షేత్రంలో జీవించేవ్యక్తి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు. He is living for others అనటం చూస్తున్న సంగతి చెప్పటమే. నేను చూచిందికొద్ది.. చూచి తెలుసుకొన్నది ఇంకాకొద్దిది. నా చూపుకందిన గాంధీక్షేత్రాన్ని చూపించటానికి ప్రయత్నిస్తాను.

6-8-1965 నాడు దివిసీమ వైజ్ఞానిక సేవాసమితి స్థాపించబడింది. దాని కనుబంధంగ పది పదకొండు సంస్థలేర్పడ్డాయి. . వివిధరంగాల్లో దివిసీమ నభివృద్ధి పథంలో నడపటం ప్రధానాశయంగా ప్రారంభమయిన ఈ సంస్థలు గాంధేయమార్గంలో సేవా కార్యక్రమాలు ఆచరణ నిమిత్తం స్వీకరించాయి. గాంధీజీకి ప్రథమ ప్రియమైన చర్కా వ్యాప్తితో ప్రారంభమై వ్యవసాయ రంగానికి సమితి ప్రణాళికలు రూపొందించింది.

గాంధీ జయంతి నానాటి నుంచి యీనాటి వరకు అవిచ్ఛిన్నంగా జరుపుకొంటున్న ఈ సంస్థ గాంధిక్షేత్రంగా పరిణమించింది ఈ పదిహేను సంవత్సరాలలో ఈ క్షేత్ర ప్రగతి అయేటి కంటె ఆయేడు తన విశిష్టతను వెల్లడిస్తూనే ఉంది. భవన నిర్మాణాలు జరిగాయి గ్రంథాలయం ఏర్పడింది. శ్రీ కృష్ణారావు గారు తమకు బహూకరింపబడిన అనేక గ్రంధాలతో గాంధీ సాహిత్యం కూడ జోడించి గాంధీక్షేత్రంలో గొప్పగొప్ప గ్రంథాలున్న విజ్ఞానదాయకమైన గ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఈ కృష్ణరాయ గ్రంథాలయం క్షేత్రంలో గాంధీ ఆశయాలకు ప్రతీకగా ప్రతిబింబిస్తోంది. గ్రంథాలయోద్యమ పితామహులు శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు ప్రారంభోత్సవం చేశారు.

ఏ సంస్థ స్థాపింపబడినా దాని ప్రారంభం ఆవిష్కారాని కనువైన వ్యక్తులద్వారానే జరపటం శ్రీ కృష్ణారావుగారి పనితనంలో ఉండే ఔచిత్యాన్ని సుస్పష్టంగా వెల్లడిస్తూ ఉంటుంది. ఈ విషయం గాంధీక్షేత్ర చరిత్రలో అడుగడుగునా

ప్రత్యక్షమయ్యే విశేషం. గ్రంధాలయాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గ్రంథపఠన ప్రీతికలవారు నిరంతరం గ్రంథాలయ వికాసం వాంచించితగిన కార్యక్రమాలు జరిపే వ్యక్తి.

ఏ సంస్థకైనా తదధిపతులు తమ తమపని సక్రమంగా చేసుకొనే చక్రం ఏర్పడింది. కాని చక్రంతిప్పే వ్యక్తి పరిశీలన మాత్రం పరమసునిశితం. దేశంలో ఉన్న అనేకులు ప్రముఖ వ్యక్తులు వచ్చి స్థాపించిన క్షేత్రసంస్థలు తమతమ వ్యవసాయం ప్రశాంతంగా సాగిస్తున్నాయి. మహిళా సేవాసంఘం సంక్షిప్త శ్రీవిద్యా కేంద్రం నిర్వహిస్తోంది. దక్షిణభారత హిందీ ప్రచార నభవారి ఆధ్వర్యంలో హిందీ ప్రచారక విద్యాలయం, హిందీ మహావిద్యాలయం గాంధీక్షేత్ర విద్యాసంస్థలుగా పనిచేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బట్టల అద్దకం శిక్షణ కేంద్రం స్త్రీలకు శిక్షణ ఇస్తోంది. వృత్తిశిక్షణ కేంద్రం టైలరింగ్ సెంటర్ ఆవృత్తిలో విద్యార్థులను తయారుచేస్తోంది. ఈ వృత్తి విద్యాసంస్థలు గాంధేయ భావాల కనుగుణంగా ఇక్కడ నెలకొల్పబడి జీవనోపాధి చూపించేవిగా నడుస్తున్నాయి.

దివిసీమ బాలానంద సంఘం, దివిసీమ లలితకళా సమితి, దివిసీమ సాహితీసమితి మొ॥ సంస్థలు విద్యా నినోద కళా వికాసానికి తోడ్పడుతున్న గాంధీక్షేత్ర సంబంధ సంస్థలు- బాలానంద సంఘం జిల్లా స్థాయిలోను రాష్ట్ర స్థాయిలోను కూడ బాల బాలికలలో వ్యాసరచనా చిత్ర రచనాదులలో ప్రోత్సాహం కలిగించి పోటీలు నిర్వహించిన ఘనత నందుకొంది.

లలితకళా సమితి రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు ఉన్నత స్థాయిలో ప్రశంసనీయంగా నిర్వహించిన ఖ్యాతి నార్జించింది. సాహితీ సమితి ప్రసిద్ధాంధ్ర కవుల నందరినీ ఆహ్వానించి కవి సమ్మేళన కార్యక్రమాలు సాహితీ సమావేశాలు నిర్వహించింది. సాహితీబంధు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ఆస్థానకవి శ్రీ దాశరధి సాహితీ సమితి సన్మానాలందుకొని అభినందించిన వారిలో ఉన్నారు.

శ్రీ కృష్ణారావుగారు బాలానంద సంఘంలో బాలుడు లలిత కళా సమితిలో సర్వకళాప్రియుడు సాహితీసమితిలో సాహితీ రసజ్ఞుడుగా ప్రత్యక్ష మవుతారు. ఆయన స్నేహశీలి. సమాజంలో ప్రజ్ఞ ఎవరిలో ఎంతవరకు ఏవిధంగా వుందో గమనించి దానినుపయోగించే ప్రజ్ఞ ఆయనలో ఉంది. రాజకీయ వేత్తలు, అధికారులు, నటులు, గాయకులు, కవులు, పండితులు, కర్షకులు, కార్మికులు, అందరు ఆయనకు మిత్రులు. వారితో ఆయన అనుబంధం అతి సన్నిహితం.

''అధృష్యశ్చా భిగమ్యశ్చ యాదో రత్నైరివార్ణవః'' అనే కాళిదాసోపమ కొంతవరకు కృష్ణరావుగారి ప్రవృత్తికి సరిపోతుంది. అదృష్యత్వం కంటె అభిగమ్యత్వమే ఆయనలో అధికం అనిపిస్తుంది. 1976 జనవరిలో గాంధీవర్ధంతి సందర్భంగా గాంధేయ సమాజ సేవా సంస్థ గాంధీక్షేత్రంలో ఏర్పడి తన ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించింది. ఈ సంస్థ ద్వారా ఈ శిబిరాలు తరువాత కూడ మరి రెండు నిర్వహించబడ్డాయి.

ఒక సందర్భంలో తెనాలి, విజయవాడ, మద్రాసులో నడుపబడుతున్న హిందీ ప్రచారక విద్యాలయాల విద్యార్థినీ విద్యార్థులు కూడ అవనిగడ్డ హిందీ ప్రచారక విద్యార్థినీ విద్యార్థులు కలసి ఈకార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉత్సవాలు ఉత్సాహ ఉన్నతంగా జరిగాయి. పెద్దల మాటలు విన్నాం. నాటకాలు చూచాం. మద్రాసు నుంచి వచ్చిన హిందీ విద్యార్థి తన మాతృ భాషలో (అరవం) మాటలాడినప్పుడు తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. తరువాత అది హిందీలో నాతో చెప్పాడు. అతడన్నదేమిటంటే మీ విద్యామంత్రిగారు అందరికీ చాల అందుబాటులో ఉన్నారు. ఏమాట ఎవరు చెప్పినా వింటారు. మనందరితో కలసి మెలిసి తిరుగుతున్నారు. ఇది నాకు చాల ఆశ్చర్యం ఆనందం కూడ కలిగిస్తోంది. మా మంత్రులు సన్నిహితంగా ఉండడం మాటటుంచి అందనే అందరు'' అని.

ఇది ఒక పరరాష్ట్ర విద్యార్థి రెండు మూడు రోజులిక్కడే ఉండి గమనించిన కృష్ణరావుగారిలో ఉన్న అభిగమ్యత్వం! ఇప్పటి వాడుక భాషలో ఆయన కార్యకర్త,

నాకాయన మంత్రిగా ఉన్న రోజులలో మంత్రిగా కనిపించలేదు. కృష్ణారావుగారి లాగే కనిపించారు అది నాభావనేమో అనుకొన్నాను. అయన మంత్రి పదవి లేని యీనాడు నాకెందుకొ మంత్రిలాగానే కనిపిస్తున్నారు. ఇదేమి భావనో తెలియటం లేదు. ''యాదృశీభావనాయత్ర ...ర్భవతి తాదృశీ'' అనే మాట నిజమే అయినా నాకు ఇక్కడ సమన్వయం కలగటం లేదు. ఇప్పుడు ఆయనను చూచి మంత్రి అనుకోవలసిన అవసరవేమిటో అర్థం కావటం లేదు. ఏదో మంత్రాగం ఎప్పుడూ ఆ యంత్రంలో పనిచేస్తూ ఉండటం చేతనే అది కనిపించి అలా అనిపిస్తోందన కుంటాను.

శిక్షణ శిబిరాలు జరిగేటప్పుడు ఆయన శిక్షకులలో కూర్చోరు. శిక్షితులలో కూర్చుంటారు. ఆయన కార్యభారం పెద్దది. దానికి తగినంత ఓపిక ఉంది. పనిచేస్తూనే శిక్షణ పొందటం అలవాటయిన మనిషి. మనషుల్ని మన్నించే స్వభావం ఏదో సమాజానికి చెయ్యాలనే ఆరాటం. సమాజంలో సత్యం స్నేహం సేవాభావం కలిగించి దర్శించాలనే ఆకాంక్ష. ఇది ఆయనచేత నిర్విరామ కార్యక్రమాలు ఏర్పాటు చేయించి నడిపిస్తున్నాయి.

సమాజంలో సర్వతోముఖ వికాసం కావాలనే విశ్వాసమే విద్యాసాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా కృష్ణారావుగారి చేత నాటకోత్సవాలు నిర్వహింపచేసింది. కళాకారులకు తగిన ప్రోత్సాహం లేకపోవటం గనునించి ఒకచేయూతనిచ్చే సంకల్పం కార్యరూపం దాల్చింది పట్టణాలలో సాంస్కృతిక కార్యక్రమాలు కొద్దోగొప్పో కనిపిస్తూనే వుంటాయి. పల్లెసీమల వారికి పూర్వ కాలపు వినోద కాలక్షేపాలు కొరవడ్డాయి. సినిమాలు మాత్రమే గతయ్యాయి, అవి దుర్గతి కల్గిస్తున్నాయి. ఇట్టి స్థితిలో సాంస్కృ....... నాన్ని పల్లెసీమలలో కలిగించాలి, ఆ కార్యక్రమాన్ని ....పట్టింది ఆరోజున గాంధీక్షేత్రానికి యావదాం .... నిష్ణాతులు బంధువులయ్యారు. ఉత్సాహం పర.......... దివిసీమ కళా తేజస్సులో కళకళ లాడింది. నీ నా అనేది రాజకీయరంగంలో, ఇంకా మరేరంగంలోనేనా

ఉంటుందేమో? గాంధీక్షేత్ర రంగంలో, కృష్ణరావుగారి అంతరంగంలో ఆ తేడా కనిపించదు. వివిధ రాజకీయ విశ్వాసపరులు, వివిధ విద్యావేత్తలు, అధికారులు కళాకారులు అందరు గాంధీ క్షేత్ర రంగంలో కలుసుకొన్నారు. ఇది ఒక స్నేహసాధన ఒక సేవా సాధన, ఒక ఆత్మీయతా ప్రదర్శన ఇంత నాటకం ఆశ్చర్యమైన ఆపూర్వ నట సమ్మేళనంగా ఆడబడింది.

1977 జూన్‌లో గాంధేయ సమాజ సేవా సంస్థ ద్వితీయ శిక్షణ శిబిరం జరిగింది. ఈ వ్యవహారమంతా గమనిస్తున్న ప్రభాకర్‌జీ గాంధీక్షేత్రానికి దగ్గరయ్యాడు. ఆ జులైలో గాంధీ క్షేత్రానికి ప్రభాకర్‌జీ అధ్యక్షులయ్యారు, ఇదంతా ఏమిటి? శ్రీకృష్ణారావు గారిలో ఉన్న ''ఫలానుమేయ ప్రారంభం''.

వయోజన విద్యాసమితి ఏర్పడింది. ఆది నేటికీ సాగుతోందంటే (ఇతర సంస్థల సంగతి వేరు) అది కృష్ణారావుగారి మీద ఉన్న గౌరవ విశ్వాసాలే అందుకు కారణమన్నది. సత్యం - ఈ సమితి ఆధ్వర్యంలో ఒక శిక్షణ శిబిరం 1977 సెప్టెంబరులో జరిగింది. ఏది జరిగినా దానికి చెందిన రంగంలో ఆరితేరిన అనుభవజ్ఞులైన వారు పాల్గొనటం సామాన్యమే కనుక ఈ చిన్నపరిధిలో పెద్దలందరి వివరాలు అందించటం అసాధ్యం.

ఎప్పటికప్పుడు అక్టోబరు రెండవ తేదిన అన్ని కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక క్రొత్త విషయానికి పునాది ప్రాతివాటికి దృఢత్వం వాటిలో ఏర్పడుతూనే ఉన్నాయి.

1977 అక్టోబరు ఆంధ్రప్రదేశ నిర్మాణ కార్యకర్తల సమ్మేళనం. గాంధీజీ కోడలు శ్రీమతి నిర్మలాగాంధీ ప్రారంభించారు, ఈ యేడు గాంధీజీ మనుమడు శ్రీకనూ గాంధీ, కోడలు నిర్మలా గాంధీల ఆగమనం కొంత ఉత్తేజాన్ని అందించటం జరిగింది. గాంధీ కుటుంబాన్ని చూచి వారి కార్యక్రమాలు తెలుసుకొని వారి ద్వారా పూర్వపు రోజులు ఉద్యమోత్సహాల్ని సంస్మరించుకొని ఆనందించే అవకాశం అవనిగడ్డ పౌరులకే కాకుండా ఆంధ్ర ప్రజలకే కలిగించిన విశిష్టతని గాంధీక్షేత్రం

అందుకున్నది. గాంధీజీ శతయంతి జరిగి కూడ తొమ్మిది సంవత్సరాలయినది కాబట్టి అందుకు చిహ్నంగా 109 వయోజన విద్యా కేంద్రాలను శ్రీమతి నిర్మలాగాంధీ ప్రారంభించారు.

గాంధీ క్షేత్రాని కనుబంధంగా సేవాశ్రమాన్ని శ్రీమతి నిర్మలా గాంధీ ప్రారంభించారు. శ్రీ మండలి పర్యవేక్షణలో గాంధీ క్షేత్ర సేవాశ్రమాలు ప్రగతిపథంలో ప్రయాణిస్తున్నాయి.

అనాధ శరణాలయంగా 50 మంది బాలబాలికలతో ప్రారంభమయిన సంస్థ కొక గురుకులం ఏర్పడింది. ప్రముఖ గాంధీయ విద్యావేత్త శ్రీ కె.ఎస్. ఆచార్యులుగారి ఆధ్వర్యంలో గాంధీయ గురుకులం నిర్వహించుచున్నారు. మత్స్య పారిశ్రామికుల బాలబాలికల కొక ఆశ్రమ పాఠశాల స్థాపించబడింది. ఇప్పుడు గురుకులంలో 150 మంది ఆశ్రమ పాఠశాలలో 130 మంది బాలథాలికలు చదువుకొంటున్నారు. వీరికి వసతి గృహం ఉచిత భోజనగృహాలు సేవాశ్రమంలో ఏర్పడినాయి. హిందీ విద్యాలయ విద్యార్థినుల వసతిగృహం కూడ సేవాశ్రమంలోనే ఉంది. సేవాశ్రమంలో బాల వాడీ ఆరు ఏడు సంవత్సరాలలోపు పిల్లలతో నడుపబడుతోంది.

ఈ మధ్యనే సేవాశ్రమంలో సుందరంగా నిర్మించబడి ఆరుబయలు రంగస్థలంలో కరుణామయుడు బుద్ధుడు. .... మయుడు క్రీస్తు, సేవామయుడు గాంధీజీ చిత్రాలు త్యాగాల సేవాభావాన్ని ప్రబోధిస్తున్నట్లు కనపడుతున్నాయి. సేవా బాలబాలికలు ఇతర గాంధీక్షేత్ర సంస్థల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు తరచు సేవాశ్రమంలో అనేక పెద్దల వర్ధంతి జయంత్యుత్సవాలు జరుపుకొంటున్నారు.

సేవాశ్రమంలో శ్రమదానం నిత్యకృత్యంగా ఉంటూనే కూరల పాదులు పెంచటం వంటి స్వయం కృషి ఆచరణ కనిపిస్తుంది. ఆశ్రమ వాసులైన ఆశ్రమ పాఠశాల గురుకుల బాల బాలికలు చిన్నపిల్లలు వారి యోగక్షేమాలు గమనించి

ఇంటి దగ్గఱున్నప్పటి కృష్ణారావుగారి నిత్యకృత్యాల్లో ఒక హిందీ విద్యార్థినులు ఆధ్యాపకులు తమమీద కృష్ణారావ చూపే ఆప్యాయతకీ ఆదరణకీ ఆనందం పొందుతూ ఉంటూ ఆడుతూ పాడుతూ మట్టిపనితో సహా వాళ్లతోకలసి చేసే కృష్ణారావుగారినే వాళ్లెరుగుదురు. ఆయన మాటలు గాయపడి న........ యాలకు చల్లని పన్నీరు జల్లులాగ స్వాంతనమిస్తూ ఉంటా'' వారంటారు. పేరు పేరున ఆరోగ్యం గురించి ...... ఆయన అడుగుతూ ఉంటే మాకు పితృతులు .... హిందీ విద్యాలయం ఉపాధ్యాయిని జొన్న .... గారు చెపుతూ ఉంటారు. అప్పుడప్పుడు మా .... శ్రీ మండలివారు మనిషికి కావలసిన కీర్తి ఖర్చుతోరాదు సత్ప్రవర్తన సదభిప్రాయాలతో కూడిన ఆచరణ మంచి మాటలతోనే వస్తుందని చెబుతూ ఉంటారని'' ఆమె అంటూ ఉంటారు. ఆయన కళాభిమాని కార్యశీలి మానవతా వాది అని మా అనుభవం వల్ల గ్రహించాం'' అన్నది.

ఆశ్రమంలో కూడ వసతి గృహాలు ఏర్పడ్డాయి శ్రీ ప్రభాకర్‌జీ తరచు సేవాశ్రమం సందర్శించుట. పర్యవేక్షించటం సూచన లివ్వటం జరుగుతూ వచ్చింది. 1977 అక్టోబరు 2 నుండి జరిగిన గాంధీ జయంతుత్సవాలలో ఆశ్రమంలో కొన్ని బ్లాకుల నిర్మాణం ప్రారంభోత్సవాలు బాలల, విద్యార్థుల, హరిజనుల సమ్మేళనం దానికి వీడ్కోలు సందేశం శ్రీ కనూగాంధీ గారివ్వటం విశేషం.

దినదినాభివృద్ధిగ పురోగమించే తరుణంలో దివిసీమకి 1977 నంబరు 19వ తేదిన సంభవించిన ఉప్పెన తుఫాను భీభత్సం కనీవినీ ఎఱగని నష్టాలు పదివేలమంది మరణం తెచ్చి పెట్టిన సంగతి జగద్విదితమే- ఆరోజు రాత్రి శ్రీ కృష్ణారావుగారు అవనిగడ్డలో ఉండటం తటస్థించింది గాలి పెరుగుతున్న కొద్ది వసతి గృహాల్లో ఉన్న బాల బాలికలకేం ప్రమాదం కలుగుతుందో అన్న భయంతో వారిని సేవాశ్రమానికి చేర్చటం, బయటికి వచ్చి ప్రమాద స్థితిలో ఒకచోట వాళ్లని తీసుకువచ్చే సందర్భంలో క్రింద పడికూడ శ్రమకోర్చి వారిని చేర్చి తెల్లవార్లు ఆ భీభత్సంలో వారితోనే ఆ పాకలోనే గడపిన ఉదంతం కూడ చిరస్మరణీయమే.

అక్కడి నుంచి భాధితులకు నిర్విరామసేవలో మండలి వారు మునిగిపోయిన సంగతి ప్రపంచం గమనించింది. ప్రభాకర్‌జీ వచ్చారు. కార్యరంగంలో దూకారు. అది విస్తృతమైంది. ప్రభాకర్ నాయకత్వంలో శవసేన యేర్పడడం శవాల తొలగింపు దహనం మొదలైన పనులలో మునిగిపోయిన కృష్ణారావు గారు ముళ్లు గ్రుచ్చుకొన్నా ఆరోగ్యం సరిగాలేకపోయినా కాయకష్టం, నడక, కార్యపరిశీలన, మొదలగు వాటిలో పాల్గొన్న తీరు సన్నిహితులను దూరస్థులను కూడ ఆశ్చర్య చకితులను చేసింది. పదవీ పరిత్యాగం- అది అంగీకరింపబడక పోవటం- జరిగాయి. ఆ సందర్భంలో సేవాశ్రమ ప్రాంగణంలో రోజు పదివేల మందికి భోజనాలు పెట్టటం నెలరోజులు నిర్వహించారు. అనేకులు పెద్దలు వచ్చారు. చూచారు. కృష్ణారావుగారు వారందరికీ ముఖ్యంగా చాలమందికీ తుఫాను దెబ్బతిన్న ప్రాంతంలోనే కనిపించారు. ఆది నిర్విరామ సేవాకార్యక్రమం-

గాంధీక్షేత్రాన్నీ సందర్భంగా శ్రీమతి ఇందిరాగాంధీ. శ్రీ మొరార్జీదేశాయ్, శ్రీ సంజీవరెడ్డి గార్లతో సహా అనేకులు సందర్శించారు. వారందరికీ పరిస్థితి వివరించటంలో కృష్ణారావుగారి నిర్విరామ కార్యక్రము మరీ పెరిగింది.- ఈ వృత్తాన్తం దీని మట్టుకొక ప్రత్యేక కథగా చెప్పుకోదగినంత పెద్దది. జాతీయ అంతర్జాతీయ, ప్రాంతీయ స్థానిక సేవా సంస్థలీ సందర్భంలో ఇక్కడ పనిచేశాయి. వాటికన్నిటికీ సమన్వయ సంఘం గాంధీక్షేత్రంలో ఏర్పడింది. చేసిన పనులు సమీక్ష చేసి చేయవలసిన కార్యక్రమానికి సక్రమమైన సమన్విత ప్రణాళిక ఈ సమన్వయ సంఘం క్షేత్రంలో సర్వతోముఖంగా రూపొందించబడింది.

ఉప్పెన భీభత్సమయ సందర్భంలో శ్రీకృష్ణారావుగారు గ్రామ గ్రామానికి వెళ్ళి ప్రతి వారినీ ప్రత్యేకంగా పరామర్శించినారు. వీలయినంత వరకు భాధితుల కవసరమైన వస్తువు లందించారు. భగవద్గీత, కొరాన్, బైబిలు గ్రంధాల సూక్తులతో ఓదార్చారు. ఉప్పెనవలన నిరాధారులై బ్రతికి పయట పడిన 400 మంది పిల్లలను

సేవాశ్రమములో సంవత్సరం పాటు పోషించారు. ఇప్పుడు యింకా 150 మంది పిల్లల్ని పోషిస్తున్నారు.

78 జనవరిలో కవులను కళాకారులను తెప్పించి అవనిగడ్డ నాగాయలంక కోడూరులలో ప్రజల సమక్షంలో సానుభూతి వాక్యాలు పలికించి ఒక విధంగా దుఃఖంలో నుంచి కొంత మానసిక పరివర్తన కలిగి మామూలు కార్యక్రమాలలో పాల్గొనగలిగే మార్గం చూపించారు.

ప్రభాకర్‌జీ సేవాశ్రమంలోనే ఉండిపోయి నిర్విరామంగా సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్‌లో శ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామివారు 47వ స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞాన్ని గాంధీక్షేత్రంలో జరిపించారు. శ్రీ సీతారామ భక్త సమాజం వారు 108 శ్రీరామ కల్యాణోత్సవాలు జరిపించారు. దేశంలో మూల మూలల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి అనేకులు పెద్దలు అనేక సందర్భాలలో వచ్చి గాంధీక్షేత్రాన్ని సందర్శించారు. ఇక్కడ జరుగుతూ ఉన్నది చూచి ఆనందించి అనుభవజ్ఞులు తగిన సూచనలు చేసి తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఎప్పుడూ ఎవరో పెద్దలు రావటం క్షేత్రం సందర్శించటం క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ ఉంది.

ఉప్పెనలో బ్రతికి బయటపడిన వారిలో చాలమంది తేరుకొన్న మీదట గాంధీక్షేత్రంలో వివాహాలు చేసుకొన్నారు. గాంధీక్షేత్రం శుభాభిముఖంగా భాధితుల్ని ప్రయాణింపచేసే ప్రయత్నంలో అనేక వివాహాలు తన రంగస్థలం మీద చూ......చటం ఆనందదాయకమైన చారిత్రక ఘట్టంగా పరిగిణి ..... దగినదైంది.

ఉప్పెనతోపాటు దెబ్బతిన్న ప్రాంతాలలో సహా కార్యక్రమాలలో పనిచేసిన వివిధ స్వచ్ఛంద సంస్థలను సంఘ సేవకులను ఆహ్వానించి మూడు వారాలపాటు చర్చలు జరిపి సమన్వయ సాధనకు ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవాసంస్థ సమాజ సేవకుల సమాఖ్యను ఏర్పాటుచేశారు.

స్వచ్ఛంద సేవాసంస్థల సేవకుల మహాసభల తరువాత నవంబరులో సుప్రసిద్ధ పత్రికా రచయిత శ్రీ యమ్. చలపతిరావు డా॥ బి.వి.ఆర్. ప్రసాదరావుగారు రచించిన ''ఉప్పెన ఉ.... తాలు'' అనే గ్రంధాన్ని ఆవిష్కరించారు.

78 డిసెంబరులో దక్షిణ భారత నిర్మాణ కార్యక్రమ మహాసభలు రాష్ట్ర గవర్నరు శ్రీ కె.సి. అబ్రహంగారు ప్రారంభించారు, దక్షిణ రాష్ట్రాలన్నిటినుండి వచ్చిన కార్యకర్తలు రెండు రోజులు కార్యక్రమాలు జరిపారు. బహిరంగ సభలో అఖిలభారత గాంధీ స్మారకనిధి అధ్యక్షులు శ్రీ అరుణాచలంగారు కార్యదర్శి శ్రీ పూర్ణచంద్ర జైన్‌గారు ఇతర నిర్మాణ కార్యకర్తలలో ప్రఖులు పాల్గొన్నారు. వినోబాభావే చేపట్టిన గోసంరక్షణ .... ప్రయత్న విశేషాలు చర్చలు, నిర్ణయాలు ఈసభలలో జరిగాయి.

14-8-79 నాడు గాంధీక్షేత్రంలో Guard అనే పేరుతో ప్రభాకర్‌జీ ఏర్పరచిన Gandhian United Action for Rural Development" అనే సంస్థ ఏర్పడింది.

సమాజంలో ఆర్థిక సాంఘిక స్థితులలో తక్కువ స్థాయిలో ఉన్నవారికి సాయపడే కార్యక్రమం ఈసంస్థ లక్ష్యంగా తనపని సాగించటానికి పూనుకుంది. ప్రభాకరాస్తమయంతో చీకటి కమ్ముకోకుండా క్షేత్రంలో వెన్నెలలు వెల్లి విరియింప చేసే భాధ్యతతో శ్రీ కృష్ణారావుగారు ప్రస్తుతం పనిచేస్తున్నారు.

79 సం॥ గాంధీజయంతి సందర్భంగా శ్రీ కనూగాంధీ వారి సతీమణి శ్రీమతి ఆబాగాంధీ, గాంధీగారి కోడలు శ్రీమతి నిర్మలాగాంధీ గాంధీక్షేత్రాన్ని సందర్శించారు. తుఫాను భాధిత ప్రాంతాల్లో పునరుజ్జీవన కార్యక్రమాలని తిలకించారు. ప్రభాకర్‌జీ పురానికి ప్రారంభోత్సవం చేశారు.

ఎప్పుడూ ఏదో కార్యక్రమం కొనసాగుతూనే పురోగమిస్తున్న గాంధీక్షేత్రం శ్రీ మండలివారి కార్య క్షేత్రంగా రూపొంది వికాసం పొందుతున్న తీరులో చెప్పగలిగినన్ని చెప్పి నాకు ఈమధ్య ప్రభాకర్ అవార్డు పొంది క్షేత్రానికి వచ్చిన కృష్ణా రావుగారిని చూచినప్పుడీ క్రిందివిధంగా అనిపించింది.

''ఒక సేవాప్రియ చిత్తవృత్తి బహుధా యోచించి నిర్మాణ కార్యకలాపమ్ములలో నహర్నిశము సర్వస్వమ్ము లగ్నమ్ముగా నొకదానింబడి యొక్క టొక్కటిగ నెన్నో సంస్థలై క్షేత్రమై వికసింపంగ నొనర్చు దీర్ఘకృషిలో వేగంటియై తోచెడిన్.

జీవిత యాత్రలో దనకుఁ జేకురినట్టి మహావకాశముల్
భావి శుభప్రదంబులగు పద్దతులన్ గమనించి దీవికిన్
జీవముపూయు కాయమయి చేవగలట్టి మహానుభావతన్
సేవకు దావలమ్మయిన సృష్టియెకన్పడు కృష్ణరావులో

అర్థ శతాబ్ది దాటి యిటులాకృతి నందిన కృష్ణరావు స
ర్వార్థ సమృద్ధి సాధన మహాకృషి నెల్లెడ నిర్విరామ కా
ర్వార్థ పరత్వమై మెలగు హాయనహాయన బద్ధ సిద్ధియై
సార్థకతా ప్రసిద్ధుడయి సాగుత ముందుకు నిత్య సిద్ధుడై.

పూజ్యబాపూజీ మార్గానఁబోయినట్టి శ్రీ ప్రభాకర్ జీతోడి సేవలోన
పండినిండిన హృదయసంపదనుపిండి తత్రియుండయి నేడు సత్కారమందె
సేవ సత్కారవాంఛతోఁ చేయఁబడదు కాని సత్కారమది తాన కల్గుచుండు
భువి సేవావిధాన విశ్వాసపదవి మీకుఁజేకురుగాక నిత్యైకపదవి.

గుండె గల మండలి

డా॥ దాశరథి

కుండ పోతగా వర్షం కురుస్తున్నా
మండి పోయే యెండలు జడిపిస్తున్నా
పగలైనా రేయైనా
ప్రజలకోసమై పరుగులు తీసే
గుండె గల మా మండలి
కోట్ల నిరుపేదల శుభలగ్నకుండలి
మానవులను ప్రేమించిన వాడు
దానవులను యెదిరించెవాడు
పెనుతుఫాను భీభత్సంలో
పీనుగల నడుమ మెలిగినవాడు
అనాధ బాలలను బుజాలపై మోసినవాడు
అనాధ ప్రేత సంస్కారం చేసినవాడు
కన్నీటి కడలిలో ఈదుకుంటూ
కన్నీటి బ్రతుకుల్ని కాపాడినవాడు
మహాత్ముడు చెప్పాడు
మండలి చేసి చూపాడు
మండలికి సన్మానం
మహాత్మునికి సన్మానం

ఆదర్శమూర్తి శ్రీ మండలి

శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి పేరు చెప్పగానే ఎకరికైనా స్ఫురించేవి – గాంధేయ సిద్ధాంతాలు, సమాజసేవ అక్ష్యాలు, నిరాడంబర విధానాలు. త్రివేణీ సదృశ్యమైన ఈ ఆదర్శ వాహినీత్రయం ఆయన జీవితంలో అంతర్నిహితమై ప్రజా శ్రేయో సంక్షేమ సాధనవైపు పురోగమింపచేస్తున్నాయి. మనసా, వాచా, కర్మణా శ్రీ మండలి గాంధీ అనుయాయి, నిజమైన సంఘ సేవకుడు, నిరాడంబరత మూర్తీభవించిన వ్యక్తి. రాజకీయంగా ఆయనను విమర్శించేవారు సయితం ఈ పరమ సత్యాలను బాహాటంగా అంగీకరిస్తారు. చిత్తశుద్ధి, నిజాయితీ ఆయనకు తరగని సంపద, మంత్రిగా పదవీ స్వీకారం చేసిన వెంటనే ఆయన తమ ఆస్తిపాస్తులను వెల్లడించి క్రొత్త సాంప్రదాయాలను నెలకొల్పారు. శ్రీ మండలి నిగర్వి, ఆయనలో వినమ్రత ఉట్టిపడుతుంది. భేషజానికి నిదర్శనంగా ఉంటుందని భావించి పూలదండలు స్వీకరించబోరని ప్రకటించి, మిత్రులు, అభిమానులు ఎందరో ఎన్నోవిధాల ఒత్తిడి తెచ్చినప్పటికి లొంగక తమ ఆశయానికి కట్టుబడి ఉన్నారు. ఆయనలోని నిరాడంబరతకు పరాకాష్టగా పేర్కొనతగినది బస్సు ప్రయాణం. ఏదో లాంఛనంగా ఒకసారి వెళ్ళిరావడంగా కాక; ఆయన వీలైనప్పుడల్లా దూరప్రయాణాలు బస్సులలో సాగించడం నియమంగా పెట్టుకొన్న ఆదర్శమూర్తి. పాలనా బాద్యత వహించే వారికి, ప్రజలకూ మధ్య సాన్నిహిత్యం పెంపొంది, అవినాభావ సంబంధం ఏర్పడాలన్నది శ్రీ మండలి ఆకాంక్ష.

త్యాగనిరతి

ప్రధానంగా శ్రీమండలి ప్రజాసేవకులు. పదవి కోసం ఎన్నడూ ఆయన తాపత్రయపడలేదు. ఆయన నిస్వార్థసేవా నిరతి, కార్యదక్షత కారణంగా పదవులే ఆయనను వరించాయి. అయితే పదవివున్నా లేకున్నా శ్రీమండలి, మండలిగానే ఉండటం గమనార్హం. ఏ పదవినైనా ఆయన ఒక భాధ్యతగా స్వీకరించటం పరిపాటి. ప్రజాశ్రేయస్సుకు దోహదం చేసే వేదికగా భావించారే గాని పేరుప్రతిష్ఠల్ని

సమకూర్చే సాధనంగా ఎన్నడూ తలచలేదు. ప్రజా జీవితంలో ఆయన అహరహం త్రికరణ శుద్ధితో కృషిచేసి సోపానక్రమంలో పురోగమించి జన హృదయ సీమలలో ఉన్నతస్థానం సమకూర్చుకున్నారు. ఎట్టి పరిస్థితులలోను ఇతరులను నొప్పించని మనస్వి. రాజకీయ ప్రత్యర్థులపట్ల ఆయనచూపే సౌహార్ధం వారిని నిరుత్తలను చేయక మానదు. బలహీనవర్గాల ప్రజలపట్ల శ్రీ మండలి కనబరచే సహానుభూతి ఆయన సౌజన్యానికి తార్కాణం దేశ ప్రగతివల్ల చేకూరేసత్ఫలితాలు బడుగు ప్రజలందరకూ అంది వారి జీవితాలు సుఖప్రదం కావాలని, వారందరూ జాతి భవితవ్యాన్ని తీర్చిదిద్దటంలో ఇతోధిక పాత్ర వహించాలని శ్రీ మండలి ఆకాంక్ష, తమకున్న ఏడున్నర ఎకరాలలో అయిదెకరాల భూమిని హరిజనులు, తదితర పేదకుటుంబాల వారికి పంచి యివ్వగలిగిన మానవతావాది ఆయన.

జననం - విద్యాభ్యాసం

శ్రీ మండలి వెంకట కృష్ణారావు 1926 ఆగష్టు 4వ తేదీన కృష్ణాజిల్లా, కైకలూరు తాలూకా పల్లెవాడ గ్రామంలో జన్మించారు. వారిది సామాన్య కుటుంబం. తల్లి మహంకాళమ్మగారు. తండ్రి వెంకట్రామయ్యగారు. దివి తాలూకా భావదేవరపల్లిలో ఉపాధ్యాయులుగా ఉండేవారు పల్లెవాడ, భావదేవరపల్లి గ్రామాలందు ప్రాధమిక విద్య పూర్తిచేసినమీదట శ్రీ మండలి అవనిగడ్డ ఉన్నత పాఠశాలలో చదివి 1930లో ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. తరువాత మచిలీపట్నం హిందూ కాలేజీలో ఉన్నతవిద్య నభ్యసించారు.

సేవారంగ ప్రవేశం

పదిహేను సంవత్సరాల ప్రాయంలోనే శ్రీ మండలిని గాంధీజీ ప్రబోధాలు ప్రభావితం చేశాయి. ఆయనలో జాతీయ భావాలు పెల్లుబికాయ. అవే ఆయన రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టాయి. 1942 లో జాతీయ విద్యార్థి సంఘ క్రియాశీలి సభ్యులుగా చేరి ఆయన ‘‘క్విట్ ఇండియా’’" మహోద్యమంలో పనిచేశారు. జాతీయ విద్యార్థి సంఘం అవనిగడ్డశాఖకు శ్రీ మండలి అధ్యక్షులుగా ఉండి దానిని అతి సమర్థతతో నడిపారు. 1944లో కాంగ్రెసుపై ఆంక్షలు

విధించినపుడు ఆ దివి తాలూకా కాంగ్రెసు సమితి సంచాలకులుగా రహస్య కార్యకలాపాలు నిర్వహించారు. 1945 శ్రీ మండలి జిల్లా విద్యార్థి కాంగ్రెసు నిర్వాహక కార్యదర్శిగా ఎన్నికయారు. ఆ సంవత్సరం అవనిగడ్డలో రెండు వారాలపాటు ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ పౌరసత్వ కళాశాలకు నడిపారు. 1946 డిటెన్షన్ వ్యతిరేకొద్యమంలో పాల్గొని శ్రీ మండలి లాఠీదెబ్బలకు గురి అయ్యారు. 1948లో ఢిల్లీలో జరిగిన ఆసియా ..... మహాసభలలో శ్రీ మండలి మద్రాసు రాష్ట్రం నుంచి ప్రతినిధిగా పాల్గొన్నారు.

యువజన నాయకుడుగా

యువకులుగా శ్రీ మండలి ప్రదర్శించిన నిర్వహణ దక్షత నాయకుల ప్రశంసలందుకున్నది. 1948-52 మధ్య కృష్ణా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయన యువకులను కాంగ్రెసు ఆడుగు జాడలలో నడిపించారు, అవనిగడ్డలో సేవాదళ సంఘాలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఆయన జయప్రదంగా అమలు జరపటం జరిగింది. రాయలసీమ క్షామబాధితుల కోసం నిధి వసూలుచేసి వారికి సహాయం అందచేశారు. పెక్కు ప్రాంతాలలో మహాసభలు యువజనులలో నవజాగృతి కలిగించారు. 1942 నుంచి 56 వరకు జిల్లా కాంగ్రెసు సంఘ కార్యదర్శిగా శ్రీ మండలి కృష్ణాజిల్లా కాంగ్రెసు సంస్థలో నూతన చైతన్యస్ఫూర్తిని ఉద్దీపింప జేశారు. తదనుగుణంగా శిక్షణ శిబిరాలు చాలాచోట్ల ఏర్పాటు అయ్యాయి.

శ్రీ మండలి ఒక వైపు కాంగ్రెసు సంస్థను పటిష్టవంతం చేస్తూ మరొక వైపున రైతాంగానికి శాయశక్తులా తోడ్పాటునందిస్తూ వచ్చారు. ఆంధ్ర రాష్ట్ర బంజరు రైతుల మహాసభ ఏర్పాటు చేసి వారి సమస్యలను సాకల్యంగా చర్చించి ప్రభుత్వానికి తగు పరిష్కార మార్గాలు సూచించారు. శ్రీ మండలి కృషి ఫలితంగా బీదలకు బంజరు భూములు పంచే కార్యక్రమం 1955లో ప్రారంభమైంది. దివిసీమ ప్రాంతంలో పది హేను వేల ఎకరాల బంజరు భూములను పేదవారికి ఇప్పించిన ఘనత ఆయనకే దక్కింది.

కార్యకర్తగా

శ్రీ మండలి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ సంయుక్త కార్యదర్శిగా నియమితులై 1958 వరకు ఆ పదవిని అత్యంత సమర్ధతతో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుకు చెందిన నిర్మాణాత్మక కార్యక్రమ సంఘానికీ, భూదానయజ్ఞ సంఘానికి నిర్వాహకులుగా పనిచేశారు. ప్రజలనుంచి విరాళాలు సేకరించి మచిలీపట్నంలో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య షష్టిపూర్తి సందర్భంగా జిల్లా కాంగ్రెసు సంఘ భవనం పైహాలు నిర్మాణానికి శ్రీ మండలి కారకులయ్యారు.

వివిధరంగాలలో

ఆయన కార్యరంగం జాతీయస్థాయికి విస్తృతమైంది. 1957లో మచిలీపట్నం నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యులుగా శ్రీ మండలి ఎన్నిక అయ్యారు. సేవాతత్పరతతో రాష్ట్ర అభ్యుదయానికి, జాతీయ శ్రేయస్సుకూ దోహదకరమైన కృషి చేసి అందరి మన్ననలుకు పాత్రులయ్యారు. 1963-69 మధ్య ఆయన కృష్ణాజిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులుగాను, ఆహారోత్పత్తి సంఘం అధ్యక్షులుగాను పనిచేశారు. కృష్ణాజిల్లాలో వ్యవసాయాభివృద్ధికి గైకొనవలసిన వివిధ చర్యల గురించి శ్రీ మండలి ప్రభుత్వానికి సమగ్రమైన నివేదిక సమర్పించారు. 1970లో అవనిగడ్డ పంచాయతీసమితి అధక్ష్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1989 నుంచి 72 వరకు శ్రీ మండలి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘ ప్రధాన కార్యదర్శిగా నిర్విరామంగా అంకుఠిత దీక్షతో పనిచేసి ఆసంస్థను పటిష్టవంతం చేశారు. లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో రాష్ట్రంలో ఘనవిజయం సాధించేందుకు శ్రీ మండలి నిర్విరామ కృషిచేశారు. ఆయన 1954 నుంచి అఖిల భారత కాంగ్రెసు సంఘ సభ్యులుగా పనిచేస్తున్నారు.

నిర్మాణ కార్యక్రమంలో

మహాత్ముని శత జయంత్యుత్సవాల సందర్భంగా శ్రీ మండలి అవని గడ్డలో ''గాంధీ క్షేత్రం'' నిర్మింపజేశారు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమానికి ఉత్తమ వేదికగా ఈ క్షేత్రం రూపొందుతున్నది. దివిసీమను దివ్యసీమగా పెంపొందిచిన ఖ్యాతి శ్రీ

మండలికి చెందడం సముచితం. ఈ ప్రాంతంలో ఆయన సహకార సేద్య బృహద్రృణాళిక, మత్స్యపరిశ్రమాభివృద్ధికి సంబంధించిన అనేక ప్రణాళికలు రూపొందించారు.

శ్రీ మండలి ప్రజాహిత సేవారంభం బహుముథమైనట్టిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఆంధ్రప్రదేశ్ మత్స్య పరిశ్రమాభివృద్ధి సలహామండలి సభ్యులుగా అమూల్య సేవ చేశారాయన. 1970 సెప్టెంబరులో ఆగ్నేయ ఆసియా దేశాలు పర్యటించారు.

సంక్షేమ మంత్రిగ

నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలచిన శ్రీ మండలి 1972లో జరిగిన సార్వత్రిక ఎన్నికలందు ఆంద్రప్రదేశ్ శాసన సభకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీలేకుండా ఎన్నిక కావడం ఆయనపట్ల ప్రజాబాహుళ్యానికున్న ఆదరాభిమానాలకు నిదర్శనం. శ్రీ పి.వి. నరసింహారావుగారి మంత్రివర్గంలో ఆయన సాంఘిక సంక్షేమ, మత్స్య పరిశ్రమ శాఖల మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. 1973 జనవరిలో రాష్ట్రపతిపాలన విధించే వరకు ఆ శాఖలను శ్రీ మండలి ఎంతో దక్షతతో నిర్వహించారు. స్వల్ప వ్యవధిలోనే ఆయన బడుగువర్గాల శ్రేయోభివృద్ధి నిమిత్తం ఎన్నో అభ్యుదయ కార్యక్రమాలు అమలుపరచారు. సాంఘిక సంస్కరణలపయిన ఒక సదస్సును. మత్స్యపరిశ్రమాభివృద్ధిపయిన ఒక సదస్సును ఏర్పాటుచేశారు. సాంఘిక సంక్షేమం కోసం ప్రత్యేక సచివాలయ శాఖను ఏర్పరచేందుకు, హరిజనులు వెనుకబడిన తరగతుల వారికోసం ఆర్థిక సహాయ సంస్థలు కొల్పేందుకు సంబంధించిన ప్రతిపాదనలకు శ్రీ మండలి రూప కల్పన చేయటం జరిగింది. వర్ణాంతర వివాహాలకు ప్రభుత్వమయిన ప్రోత్సాహం లభింపచేసే కార్యక్రమానికి నాంది ఏర్పరచింది శ్రీ మండలిగారే. ప్రైవేటు హాస్టళ్ళ నిర్వహణలో అవినీతిని రూపుమాపి, హాస్టళ్లను ప్రభుత్వ యాజమాన్యం క్రిందకి తెచ్చేందుకు శ్రీ మండలి పట్టుదలతో కృషిచేచేశారు. హరిజన ఇళ్ల స్థలాలు కేటాయించే కార్యక్రమాన్ని సత్వర పరచి జీవిత భీమా సంస్థ ఆర్థిక సహాయంతో

హరిజనులకోసం వాడలను నిర్మింపచేశారు. శ్రీ మండలి ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ, మత్స్య పరిశ్రమశాఖలు కొత్త రూపురేఖలను సంతరించుకొని శక్తివంతమయ్యాయి.

సమైక్యతా వీరుడు

రాష్ట్ర విభజన కోరుతూ తీవ్ర ఆందోళన ముమ్మ చెలరేగి ప్రతిఘటన పతాకస్థాయిలో వున్నప్పటికి శ్రీ మండలి మేరునగధీరులై సమైక్యతా లక్ష్యంపట్ల అచంచల విశ్వాస వజ్రసంకల్పంతో ప్రతీప శక్తులను ఎదుర్కొని రాష్ట్ర సమైక్య పరిరక్షణకు కారకులయ్యారు.

విద్యామంత్రిగా

రాష్ట్రపతి పాలన అనంతరం శ్రీ జలగం వెంగళరావు నాయకత్వాన నూతన మంత్రివర్గం ఏర్పడినప్పుడు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు విద్య, సాంస్కృతిక వ్యవహార మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. ఈ నూతన బాధ్యత చాలా గురుతరమైనట్టిదని ఆయన సవినయంగా తెలియపరుస్తూ శక్తి వంచన లేకుండా కృషి చేయగలనని వాగ్దానం చేశారు. రాష్ట్ర విద్యాశాఖను పునర్వవస్థీకరించి దానిని శక్తిసంపన్నం చేసేందుకు శ్రీ మండలి కృతనిశ్చయంతో కృషి సాగించారు, విద్యావిధానం పైన ఒక సదస్సును ఏర్పాటు చేసి అభిజ్ఞుల సూచనలను పొందారు. ప్రభుత్వ పరీక్షలలో జరుగుతున్న అక్రమ విధానాలను అరికట్టేందుకు సంచార తనిఖీ బృందాల ఏర్పాట్లు మొదలైన చర్యలు గైకొన్నారు, దానితోపాటు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి ఇటువంటి అక్రమ విధానాలు వారికే హానికరమని నచ్చజెప్పారు. నిష్పక్షపాతంగాను, క్రమశిక్షణాయుతంగాను పరీక్షలు జరపడం అవసరమని విద్యార్థిలోకం అంగీకరించింది, చిరకాలంగా ఉపాధ్యాయులకు ఎదుర్కొంటున్న పెక్కు సమస్యలకు సమర్థతతో పరిష్కరించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. శ్రీ మండలి తలపెట్టిన సంస్కరణలకు అభివృద్ధికర కార్యక్రమాలకు సర్వదా ముఖ్యమంత్రిగారి అండదండలు లభించడం ముదావహమైన విషయం.

సాంస్కృతిక రంగంలో

ముఖ్యంగా సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా శ్రీ మండలి తెలుగు సీమలోనే గాక యావద్భారత దేశంలో కూడా నూతన చైతన్యం వెల్లివిరియ జేశారు. సాంస్కృతిక రంగంలో కనీ వినీ యెరుగని ఆనందోత్సాహాలు జనించాయి. 1974లో అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాలు, అఖిల భారత తెలుగు బాలల మహోత్సవాలు విజయవంతముగా నిర్వహించి సాటిలేని కార్యదక్షతను నిరూపించారు. 1975 ఏప్రిల్ హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన సంఘ కార్యనిర్వాహక అధ్యక్షులుగా దివారాత్రులు శ్రమించి ప్రతి అంశం పట్ల వ్యక్తిగతంగా శ్రద్ధ చూపి ఎవరూ ఊహించనంతటి విజయాన్ని సాధించిన ధీశాలి, కార్యశీలి శ్రీ మండలి. అంతర్జాతీయ తెలుగు సంస్థను రాష్ట్రంలో బాలల అకాడమీని, హైదరాబాదులో శాశ్వత ప్రాతిపదికపై 'తరతరాల తెలుగుజాతి' అనే ప్రదర్శనను నెలకొల్పేందుకు ఆయన సంకల్పించారు.

సమాజ సేవ

1977 నవంబరులో వచ్చిన ఉప్పెన, తుఫాను భీభత్సవ సమయంలో రక్షణ. సహాయ పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలలో శ్రీ కృష్ణారావు చేసిన కృషి జగద్విఖ్యాతి చెందినది. సేవాసంస్థలు, ప్రజలు, ప్రభుత్వ అధికారులను సమన్వయ పరచుకొంటూ వారు చేసిన సేవా కార్యక్రమాల వల్లనే ఉప్పెనచే సర్వనాశనమైన ప్రాంతము త్వరలో కోలుకొని సర్వ సౌకర్యాలతో అలరారుచున్నది. గాంధీక్షేత్రానికి అనుబంధంగ సేవాశ్రమాన్ని స్థాపించి ఉప్పెన వలన నిరాధారులైన పిల్లలను పోషిస్తూ గాంధీ గురుకులంలో వారికి విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. గాంధీ క్షేత్రంలో హిందీ ప్రచారక విద్యాలయం, కుట్లుశిక్షణా కేంద్రం, అద్దకం శిక్షణా కేంద్రం, మత్స్య పారిశ్రామికుల పిల్లలకు ఆశ్రమ పాఠశాల, బాలికల వృత్తి విద్యాలయం. వయోజన పాఠశాలలు మొదలగు సంస్థలు నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరుపుచున్నారు.

దక్షిణ భారత నిర్మాణ కార్యకర్తల మహాసభలు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల, సంఘ సేవకుల మహాసభలు నిర్వహించి నిర్మాణ కార్యకర్తలలో నూతన

ఉత్సాహాన్ని సమన్వయాన్ని సాధించడానికి కృషి చేశారు. వారిసేవలకు గుర్తింపుగ 1977-78 సంవత్సరములో ఉత్తమ సమాజ సేవకునికి లభించే ప్రభాకర్ ఆవార్డు ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల, నమాజ సేవకుల సంఘం శ్రీ కృష్ణారావుకి బహుకరించింది. వారి సేవలకు ఇది చిన్న గుర్తింపు మాత్రమే.

1976లో ద్వితీయ విశ్వ హిందీ నుహాసభలో వారందరితోపాటు ప్రతినిధిగ మారిషన్ వెళ్లారు. ఆచట తెలుగువారిలో ఉత్సాహాన్ని కల్గించారు. 1979లో మరేషియా వెళ్లి ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లు గావించి దక్షిణాది తెలుగువారున్న గ్రామాలు తిరిగి ఉత్సాహపరిచారు.

ప్రజల మనిషి

నవసమాజ స్థాపనాధ్యేయం అకుంఠితదీక్ష, ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, త్యాగనిరతి, సేవాతత్పరత, చిత్తశుద్ధి, నిరాడంబరత, మూర్తీభవించిన శ్రీ మండలి విరామ మెరుగని ....శూరులు. ఆయన ప్రజల మనిషి. మృదుభాషి. స్వపర వర్గబేధం ఎరుగని ఆదర్శ నాయకులు శ్రీ మండలి. ఆయన ధర్మ.... శ్రీమతి ప్రభావతిగారు భర్తకు ప్రజాహిత కార్యక్రమాలలో చేదోడు వాదోడుగా వుండే ఆదర్శ గృహిణి. శ్రీ మండలి దంపతులకు ఇద్దరు కుమారులు - చిరంజీవులు బుద్ధప్రసాద్, ...ప్రసాద్, ఇద్దరు కుమార్తెలు చిరంజీవులు అన్నపూర్ణాదేవి, రేవతి.

జీవితంలోనూ, సమాజ దృక్పథంలోనూ, ప్రభుత్వ పాలనలోనూ, గాంధేయ సిద్ధాంతాలకూ, ఆదర్శాలకూ అత్యంత ప్రాధాన్యత నిచ్చి వాటిని ఆచరణలో పెట్టే ఆదర్శమూర్తి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు.

పాత క్రొత్తల మేలు కలయిక మండలి

కోదాటి నారాయణరావు

1964-1969 అయిదు సంవత్సరాలు గాంధీ శతజయంతి ఉత్సవాలుగా పరిగణించారు గాంధీ స్మారక నిధి వారు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో అనేక కార్యక్రమాలు ఆ కాలంలో జరిగినవి. 'అవనిగడ్డ'లో గాంధీక్షేత్రం నెలకొల్పి కొన్ని కార్యక్రమాలను అక్కడ జరిపించారు. మండలి వెంకట కృష్ణారావు గారు. గాంధీ స్మారక బిళ్లలు ఫొటోలను తీసికొనుటకు ఆంధ్రప్రదేశ్ గాంధి స్మారక నిధి కార్యాలయానికి వారు తరచూ వస్తూ వుండేవారు, ఆ సందర్భంలో వారితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి క్రమేణా మాలో సాన్నిహిత్యం పెరగజొచ్చింది. అందువల్ల చాలా సమీపంగా వారిని పరికించే అవకాశం నాకు కలిగింది.

కృష్ణారావుగారు వస్తుతః స్వాతంత్ర్య సంగ్రామం తరువాత వచ్చిన నవశకానికి సంబంధించినవారు, పదవులను వద్దనడం, వైరాగ్యంగా మసలడం మొదలయిన పురాతన గాంధియుగపు లక్షణాలు ఆయన అంతగా పాటించడు. అయితే ఆ యుగపు సంస్కారాన్ని ఆయన చాలావరకు ఆకళింపు చేసుకున్నారు. అందువలన ఆయనకు లభించిన ప్రతి అవకాశాన్ని ప్రజాసేవకై వినియోగిస్తారు. పంచాయితీ సమితి అధ్యక్షులుగా నున్నా, పార్లమెంటు మెంబరుగానున్నా, మంత్రిగానున్నా తనకు లభించిన అవకాశాన్ని పలుకుబడిని ఏదోవిధంగా ప్రజాసేవకు వినియోగిస్తారు. ఇదీ ఆయనలోని విశేషం. అంతేకాదు. పాతకాలం నాటి మనుష్యులను చాదస్తులుగా పరిగణించే ఆధునిక రాజకీయవేత్తలవలె గాక పాతకాలపు కార్యకర్తల త్యాగాన్నీ, శీలాన్నీ, దృష్టిలో వుంచుకొని వారిని గౌరవించటం ఈయనలోని మరొక విశేషం.

మనం అవనిగడ్డ వెళ్లి చూస్తే అక్కడి గాంధిక్షేత్రమూ, దాని అనుబంధ సంస్థలూ, ఆయన సేవానిరతికి తార్కాణాలుగా కనిపిస్తాయి. సాంఘిసంక్షేమ

మంత్రిగానున్నా, విద్యామంత్రిగా నున్నా వాటివలన లభించే అవకాశాలను గాంధిక్షేత్రానికి, దాని అనుబంధసంస్థలకు ఏవిధంగా వినియోగించారో అర్థమవుతుంది. ఆయన ఏబదవ జన్మదినోత్సవ కార్యక్రమం ఇప్పటికీ నాకు కనులకు కట్టినట్లున్నది. ఆనాడు ఆయన సకుటుంబంగా బయలు దేరి పెద్దలు శ్రీ కొడాలి ఆంజనేయులు, ఉమ్మెత్తుల కేశవరావు గార్ల వంటి వారి ఇండ్లకేగాక నావంటి సామాన్య కార్యకర్త ఇంటికి గూడా వచ్చి నూతన వస్త్రాలతో సత్కరించి, ఆశీర్వాదాలు పొందారు. అప్పుడాయన విద్యామంత్రి. నేను కుటుంబయుక్తంగా ఆయన ఇంటికే వస్తానని ఫోనుచేశాను. కాని ఆయనే మా ఇంటికి వచ్చారు. ఇది నేను పేర్కొన్న రెండవ విశేషానికి నిదర్శనం. ఇక మూడవది ఆయనలో వుండే నిరాడంబరత. పదవి లభించగానే వేషాలు మార్చే అనేకమంది మిత్రులను చూచాను, కాని ఆయన ఏపదవిలో వున్నా సగంచేతుల ఖద్దరు చొక్కా, పల్లెటూరి ధోవతి కట్టు. ఎన్నడూ ఆయన ఎం.ఎల్.ఏ. అంచు ధోవతి అయినా కట్టగా చూడలేదు.

ఇదంతా ఒక ఎత్తు. తుఫాను, ఉప్పెన తాకిడికి సర్వం కోల్పోయిన దివిసీమ ప్రజలకు ఆయన సేవ మరొక ఎత్తు. ఆయన వారికేం చేశాడని కాదు. తాను స్వయంగా బాధితుడుగా అనుభూతి పొందారు, వారి కష్టాలు తన కష్టాలుగా భావించారు. అదీ ఆయనలోని ప్రత్యేకత. తనకుగల పలుకుబడిని యావత్తు వారి సహాయ సంపత్తుల కొరకు వినియోగించారు. కేవలం తాత్కాలిక సహాయం కాకుండా పునరావాసానికి కృషిచేశారు. అనేక వ్యక్తుల ద్వారా, సంస్థల ద్వారా అందే సహాయాన్ని ఒక కొలికికి తీసుకునివచ్చి క్రియ పద్ధతి ఏర్పడేటట్లు కృషిచేశారు.

ఈ సేవాకార్యాలలో కృష్ణారావు గారికి విశేషమైన స్ఫూర్తి నిచ్చినవారు స్వర్గీయ ప్రభాకర్‌జీ. ముఖ్యంగా ఆయన బాల బాలికలకు శరణాలయ స్థాపనకు ప్రధాన ప్రోత్సాహకులు ప్రభాకర్‌జీ. కృష్ణారావు గారికి ఆయనంటే ఎంతో ప్రేమ, భక్తి.

వాటన్నిటిని పురస్కరించుకొని ప్రభాకర్‌జీకి స్మృతి చిహ్నంగా సంఘ సేవకులకిచ్చే ప్రథమ వార్షిక అవార్డు కృష్ణారావు గారికే లభించటం ఎంతో సమంజసంగా వున్నది. ఆయనకు ఈ శభ సందర్భంలో హృదయపూర్వక శుభాకాంక్షలు.

నిజమైన గాంధీవాది

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

మండలి కృష్ణారావుగారిని ఒకటి రెండుసార్లు మాత్రమే చూడగలిగాను. మనుష్యుడుగా మానవతావాదిగా ఆయన చాలా గొప్పవాడు, బాహ్యడంబరాలకు వెల లిచ్చుకోని ఆయన మనస్తత్వం నాకెంతో సంతోషాన్నిచ్చింది. మొన్నటి తుఫాను భీభత్సంలో ఆయన రాత్రి అనక-పగలనక-తన శరీరారోగ్యాన్ని కూడ లక్ష్యపెట్టకుంటా బీదలకోసం శ్రమించినాడు. ఆయన నిజమైన గాంధీవాది. వారికి 'ప్రభాకర్‌జీ' అవార్డేమిటి? అంతకంటే గొప్ప గుర్తింపు జరగవలసిన ఆవసరం యెంతయినా వుంది కాని ఈ సమాజంలో అర్హులకు అర్హ గౌరవాలు యెప్పటికీ ...చవు. ఏవో చిన్న గౌరవాలు యెప్పుడో జరుగుతాయి. అందులో యీ అవార్డు ప్రదాన సందర్భంలో వారిని మనసారా అభినందిస్తున్నాము. పరమేశ్వరుడు వారికి ఇతోధికంగా ఆయురారోగా దయచేయుగాక !

ఉత్తమ సంఘ సేవకుడు శ్రీ మండలి

తుర్లపాటి కుటుంబరావు

నిస్వార్థ సేవకు, నిర్మొగమాటానికి నిరాడంబరత్వానికి మారుపేరు శ్రీ మండలి.

ముఖ్యంగా రెండు సందర్భాలలో ఆయన కార్య దక్షత, సేవాదీక్ష ప్రపంచానికి వెల్లడి అయివాయి- ఈ సందర్భాలలో ఒకటి శుభావవాహమైనది కాగా రెండవది దుఃఖావాహమైనది. మొదటిది ప్రపంచ తెలుగు మహాసభలు కాగా రెండవది ప్రపంచ చరిత్రలోనే భయంకరమైన దివిసీమ ఉప్పెన భీభత్సనం.

ప్రపంచ తెలుగు మహాసభలు

వందలాది సంవత్సరాలలో వేర్వేరు రాష్ట్రాలతో దేశ విదేశాలలో చెల్లా చెదురుగా వుండిపోయిన తెలుగువారి నందరిని ఒక్కచోట సమావేశ పరిచిన హెచ్చుపాలు ఆనాటి విద్యా సాంస్కృతికశాఖ మంత్రి శ్రీ మండలిదే- అది ఆయన జీవితంలో మహోజ్జ్వలమైన అధ్యాయం. ఆయన కీర్తికిరీటంలో కలికితు రాయిగా నిలచే సంఘటన-

ఆహోరాత్రాలు కష్టించి, వివిధ ప్రాంతాలు శ్రమించి తిరిగి కళాకారులు, రాజకీయవేత్తలు, సాహిత్యపరులు ఆందరిని సమన్వయ పరచుకొంటూ ప్రపంచ తెలుగు మహాసభలను జయప్రదంగ నిర్వహిఁచ గలిగినారు.

తెలుగుదేశ సమ గ్రామాభివృద్ధికి సుస్థిరమైన సమైక్యత సద్భావాలు అవుసరమని వాటికి దోహదం చేయడానికి ప్రపంచ తెలుగు మహాసభలు అని ఎలుగెత్తి చాటారు.

దేశ దేశాల తెలుగు ప్రతినిధులు పాల్గొన్న, లక్షలాది ప్రజలు వీక్షించిన ఆ మహాసభలు సమైక్యతకు, సమగ్ర ఆంధ్రప్రదేశ్ సుస్థిరతకు ఎంతగానో

తోడ్పడినాయి. ప్రపంచంలో తెలుగు జాతి గుర్తింపబడేందుకు తెలుగు భాషకు, సంస్కృతికి ప్రోత్సాహాలు లిఖించాయి.

జల ప్రళయం

రెండవ సందర్భం :- దివిసీమలో వచ్చిన ఉప్పెన భీభత్సంలో ఆయన సేవ అపూర్వమైనది. చిరస్మరణీయమైనది. ఈ శతాబ్దంలోనే, ఇటీవల చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రీతిలో పెనుతుఫాను. ఉప్పెన అపార కష్ట నష్టాలు వాటిల్ల చేసినప్పుడు శ్రీ మండలి నడుంబిగించి రక్షణ, సహాయ, పునరావాస కార్యక్రమాలలో చేసిన కృషి ప్రజలు ఎన్నటికి మరువలేరు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే వారిలోని మానవత మరువలేనిది. ఎక్కడ ఆపదవచ్చినా పరుగిత్తుకొని వెళ్లేవారు. వారు సంక్షేమ మంత్రిగా ఉన్నప్పుడు విజయవాడతో జరిగిన ఘోరఅగ్నిప్రమాద వార్తవిని హుటాహుటిని హైద్రాబాదు నుండి వచ్చి సహాయ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఏచట అగ్నిప్రమాదాలు, వరదలు తుఫాను వలన నష్టము కలిగిందన్నా, ప్రజలు బాధ పడుతున్నారన్నా శ్రీ కృష్ణారావుగారు వెంటనే ఆచటకువెళ్ళి ప్రజలను పరామర్శించి భాధితులకు సహాయ కార్యక్రమాలు చేయించేవారు. విద్యార్థిదశ నుండి ఇటువంటి సహాయ కార్యక్రమాలలో పాల్గొనే అలవాటు వారిది. పేదలను, బాధితులను ఆదుకోవాలనే ఆతురత వారిలో ఎంతగానో వుంది. అందుకే 1972లో ముఖ్యమంత్రిగ శ్రీ పి.వి. నరసింహారావు గారు అయినప్పుడు సాంఘిక సంక్షేమశాఖ కావాలని స్వయంగ ఆడిగి తీసుకున్నారు. ఏదో పెద్దశాఖ యివ్వాలని అనుకొన్నానని, సాంఘిక సంక్షేమశాఖ చాలా కష్టమైనదని శ్రీ పి.వి. అన్నప్పటికి. దీన జనులకు సేవచేయడానికి సాంఘిక సంక్షేమశాఖనే తీసుకొని సమర్థతతో నిర్వహించారు. సంఘ సేవకుడుగ, సామాన్య కార్యకర్తగ రాజకీయాలలో పైకి వచ్చినవారు శ్రీ కృష్ణారావు. నమాజసేవా విశిష్టతకు సంఘక్షేమానికి కార్యక్రమాలు రూపొందించారు, అమలు జరిపారు. గాంధీక్షేత్రం చూస్తే వారి నిర్మాణాత్మక కృషి

మనకు కనబడుతుంది. ఆయన తన కొద్దిపాటి భూమిని హరిజనులకు గిరిజనులకు పంచి పెట్టారు. వారిలో అభ్యుదయ సేవాభావాలు ఆదర్శ సంఘ సేవకునిగా రూపొందించాయి. అవకాశాలు వచ్చినప్పుడల్లా దళిత, దరిద్ర, పీడిత ప్రజా సంక్షేమానికి తోడ్పడాలని వారి అభ్యున్నతికి కృషిచేయాలని ఆయన తపన.

ఉప్పెన, తుఫాను భీభత్స భయానక సమయ ధైర్యంతో నిలబడ్డారు ఒక ప్రక్క శవాలు, రెండవ ప్రక్క జీవచ్ఛవాలు, బాధితులను ఓదార్చడం వారికి సహాయ ....క్రమాలు - శవాలను తీయించడం. దారులు చేయించడం. పు.... పెట్టుకొనిపోయి గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలు ఎ... సలుపుతు ప్రజలు బాధలలో వుండగ తను పదవిలో వుంటే న్యాయంకాదని మంత్రి పదవికీ రాజీనామా చేసి తనలోని మానవతను నిరూపించుకోన్నారు శ్రీ మండలి. పదవి విడిచిపెట్టిన అది వదలలేదు. సహాయ పునరావాస శాఖలు యిచ్చారు. స్వచ్ఛంద సంస్థలను అధికారులను ప్రదానులను సమన్వయము, సహాయ పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలను ఉధృత సాగించారు.

పదవి ఉన్నా లేకపోయినా ఒక్కటిగానే .... కార్యకర్త శ్రీ మండలి. వారి నిర్విరామ కృషి ఫలితమే ఉప్పెనలో సర్వనాశనమైన ప్రాంతాలలో నేడు సర్వాంగ సుందరమైన ప్రాంతాలుగ రూపురేఖలు దిద్దుకొంటున్నవి.

అట్టి నివాడంబర, నిస్వార్థ ప్రజాసేవకునికి ఉత్తమ సంఘ సేవకునిగ ప్రభాకర్‌జీ ఆవార్డు లభించడము. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని భాగ్యనగరంలో ఆయనకు సత్కారం జరపడం బహుధా ప్రశంసనీయం. సముచితం.

శ్రీ మండలి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో వుండిపోవాలని నా ఆకాంక్ష.

పేదల జీవిత నౌక

పోతుకూచి సాంబశివరావు

మానవ సేవ
మా ‘నవసేవ’గా
నాయకులు మార్చిన
ఆధునిక కాలంలో
ఎదురు సృష్టి
ఎంతకాలం మనగలదు?
ప్రళయ జీమూత
ఘేళ ఘేళార్భటులతో
గంగ ఉబికి నర్తించిన తరుణంలో
ఆర్తనాదాలను
అరికట్టిన కృషి
ఎంతకాలం మనగలదు?
ప్రజల జీవితం
ఒక స్వంత జమీందారీలా

వాడుకుంటున్న
రాక్షస నాయకుల మధ్య
ఒక సేవామూర్తి
ఎంతకాలం మనగలదు?

ప్రభాకర ఆత్మ తేజస్సు
ప్రసరించినపుడు
కృష్ణుని మూర్తికి
జ్యోతిలా వెలుగుతుంది.

ఇది స్వప్నం కాదు
ఫలించిన కల.
సేవకు మారు పేరు
యం.వి. కృష్ణారావు
పేదల జీవిత నౌక
ప్రతిబింబం ఆయన రూపం.

ప్రభాకర్ జీ అవార్డు- ఉత్తమ సమాజ సేవకు 1978

త్యాగం. సేవాభావము పెంపొందించినప్పుడే నైతిక విలువలు పెరుగుతాయి. బుద్దుడు, గాంధీలాంటి మహనీయులు త్యాగము, సమాజ సేవవలన మానవతకు వన్నె పెట్టారు. నైతిక శక్తిని పెంచారు.

ఈ ఆశయముతో సమాజ చేసేవారెందరో వున్నారు. క్రైస్తవుడుగా పుట్టి, బౌద్ధుడుగా ఆలోచనలలో పెరిగి తిరిగి, గాంధీజీ అనుచరుడగ పనిచేసి సమాజంగ పెంపొంది. చివరకు సమాజ సేవలోనే ఐక్యం అయిన పూజ్య ప్రభాకర్‌జీ చరితార్ధుడు, వారి పేర ఉత్తమ సమాజ సేవకుని అవార్డు యివ్వాలని తద్వారా యువతరంలో త్యాగభావాన్ని. సేవాసక్తిని ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల సమాఖ్యనిశ్చయించింది. 1977-78 సంవత్సరములో పనిచేసిన సమాజ సేవకులలో ఉత్తమ సమాజ సేవకుని ఎన్నిక చేయుటకు శ్రీ మీర్ అక్బర్ ఆలీఖాన్ (ఒరిస్సా మాజీ గవర్నరు) సంఘ అధ్యక్షులు. శ్రీ కొదాటి నారాయణరావు, కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధిః సంఘ ఉపాధ్యక్షులు. శ్రీ ఎం.ఎస్. రాజలింగం, సంస్థ ప్రధాన శౌర్యదర్శి గార్లతో ఒక కమిటీ నియమించింది, ఆ సంఘం వివిధ కోణాలలో పరిశీలన జరిపి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారిని ఉత్తమ సమాజ సేవకుడుగా ప్రకటించారు.

ఆవార్డు ప్రదానోత్సవం

ప్రభాకర్‌జీ అవార్డును, 10 వేల రూపాయల చెక్కును 19-2-1980వ తేదీన సంఘ అధ్యక్షులు శ్రీ మీర్ అక్బర్ ఆలీఖాన్ గారు శ్రీ కృష్ణారావుగారికి బహూకరించారు. శ్రీ కృష్ణా జల ప్రళయ భీభత్సవంలో చేసిన సేవలను కొనియాడారు. ఆయన నిజమైన సమాజ సేవా కార్యకర్త అని ఆయన అన్నారు.

కోదాటి నారాయణరావు స్వాగతం చెబుతూ శ్రీ కృష్ణారావు మంచి నిర్మాణ కార్యకర్త అన్నారు. శ్రీ ఎం.ఎస్.రాజ... గారు మాట్లాడుతూ శ్రీ మండలి మంచి సమన్వయ కర్త అన్నారు.

గవర్నరు శ్రీ కె.సి. అబ్రహం తమ సందేశంలో కృష్ణారావుని ఉత్తమ సమాజ సేవకుడుగ నిర్ణయించడం సముచితమయిన నిర్ణయమని పేర్కొన్నారు.

శ్రీ లవణం, శ్రీ దత్తాత్రేయ వివిధ సంస్థలను ....నించారు. ఉప్పెన ప్రాంతంలో పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి మెమొంటాలు యిచ్చారు.

శ్రీ కృష్ణారావుగారు జవాబిస్తూ తమకు ఇచ్చిన .... ప్రభాకర్‌జీ దీనజన ఫౌండేషన్‌కు మూలధనంగా ప్రారంభిస్తున్నానని, రెండులక్షలకు మూలధనాన్ని పెంచి దానిమీద వడ్డీతో సంవత్సరం ఉత్తమ సమాజ సేవకునికి అవార్డు, ప్రభాకర్‌జీ మెమోరియల్ లెక్చర్, సదస్సు, సేవాశ్రమంలో ప్రభాకర్‌జీ స్థాపించిన దీనజన సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ చేయగలనని చెప్పారు. సమాజ సేవలో యువకులలో త్యాగము, భావము పెంపొందించడానికి ఉత్సాహపరచడానికి ఈ .... ఉపయోగపడగలదని శ్రీ కృష్ణారావుగారు అన్నారు.

శ్రీ సంతాన బాబు వందన సమర్పణ చేశారు.

హైదరాబాద్‌లో శ్రీ మండలి అభినందన సభ

1977-78 సంవత్సరానికి ఉత్తమ సాంఘిక సేవా కార్యకర్తగా ప్రభాకర్‌జీ అవార్డు అందుకున్న శ్రీ మండలి వెంకట కృష్ణారావును అభినందించటానికి జంట నగరాలలో మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ గోపాలరావు ఎక్బోటే అధ్యక్షతన ఒక అభినందన సంఘం ఏర్పడినది. అభినందన కార్యక్రమం సుల్తాన్ బజార్‌లోని గాంధీ జ్ఞానమందిరంహాలులో మార్చి 19 సాయంత్రం ఏర్పాటు చేశారు.

తొలుత కార్యదర్శి శ్రీ బి. కృష్ణంరాజు ఆహ్వానితులకు స్వాగతం చెప్పి వేదిక పయికి ఆహ్వానించారు. సీతా అనసూయల 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాలాపన పిదప, జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ శ్రీ యం.వి.రాజగోపాల్ తమ స్వాగతోపన్యాసంలో గడచిన 20 సంవత్సరాలుగా తనకు శ్రీ కృష్ణారావుతో ఉన్న పరిచయాన్ని ప్రస్తావించి, కోస్తా ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యం ఏర్పడినప్పుడు అక్కడ బాధితుల సేవలో నిమగ్నమై ఉన్న సమయంలో కనబడిన శ్రీ కృష్ణారావు గారిలో ఒక కొత్తవ్యక్తిని చూడగలిగామని అన్నారు. రాజకీయ పరిణామాలతో పెనగులాడుతూ ఉండే వ్యక్తులలో ఇటువంటి మానవతా దృష్టి, సేవానురక్తి అరుదని, తమదృష్టిలో శ్రీ కృష్ణారావుగారు రాజకీయ రంగంలో అపురూపమయిన ఒక మహావ్యక్తి అని చెబుతూ శ్రీ రాజగోపాల్ అభినందించారు.

శ్రీ గోపాలరావు ఎక్బోటే :

శ్రీ ఎక్బోటే తమ అధ్యక్ష వచనాలలో స్వాతంత్ర్యానంతరం దేశకాల పరిస్థితులలో వచ్చిన మార్పులను సమీక్షించి సేవాభావం, త్యాగం, క్రమక్రమంగా సన్నగిల్లుతూ వచ్చినందుకు విచారం వ్యక్తంచేసారు. సాంఘిక సేవ కార్యకర్తలకు స్వచ్ఛంద సేవా సంస్థలకు గుర్తింపు, ప్రోత్సాహము అవసరమని ఆయన సూచిస్తూ ప్రభాకర్‌జీ అవార్డ్ ఏర్పాటు ఇటువంటి ప్రోత్సాహాన్ని సమకూర్చగలదని ఆయన

ఆశించారు. పదవులను, కీర్తిని ఆశించకుండా వినమ్ర సేవాభావంతో శ్రీ కృష్ణారావు చేస్తున్న సేవలను ముఖ్యంగా తుఫాను, ఉప్పెన సమయంలో, ఆ తరువాత ఆయన బాధితులకు చేసిన విశిష్ట సేవలను శ్రీ ఎక్బోటే కొనియాడారు. శ్రీ మండలి కృష్ణారావు జాతీయ దృక్పధం కలవారని జాతీయ సమైక్యత వారి ధ్యేయమని చెప్పుతూ, ఆయన విద్యామంత్రిగా ఉన్నప్పుడు అన్ని భాషలకు సమాన గౌరవం యిచ్చారని, త్రిభాషా సూత్రానికి అధిక ప్రాధాన్యత నిచ్చారని కొనియాడారు.

డా॥ దాశరథి

ఆస్థానకవి డా॥ దాశరథి శ్రీ కృష్ణారావు వ్యక్తి కాదు, సంఘం. అందుకు ఆయన ఇంటి పేరు 'మండలి' సాక్షి అన్నారు. ప్రభాకర్‌జీ అవార్డ్ ఆయనకి లభించటం సముచితమైనదని డా॥ దాశరథి అభినందించారు. ''మహాత్ముడు సంపూర్ణ చంద్రబింబం అయితే అందులో కొన్ని కళలున్న మహానుభావులున్నారు. వారిలో ప్రభాకర్‌జీ ఒకరు. ఈ అవార్డు ద్వారా మహాత్ముని ఆ కళలు మండలి వారికి సంక్రమించినాయి. పర్వతమైనా పరమాణువైనా పరమార్థంలో ఒక్కటే'' అన్నారు డా॥ దాశరథి.

శ్రీ మీర్ అక్బర్ అలీఖాన్

ఆ తరువాత అవార్డును ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థల, సాంఘిక సేవా కార్యకర్తల సంఘం అధ్యక్షులు, మాజీ గవర్నరు శ్రీ మీర్ అక్బర్ అలీఖాన్ ప్రసంగిస్తూ ప్రభాకర్‌జీ గొప్పదనాన్ని ఉగ్గడించి తొలి ప్రభాకర్‌జీ ఆవార్డు శ్రీ మండలి వారికి అందజెయ్యటం ఏంతో సముచితమైన నిర్ణయమని అన్నారు. సమయపాలన, వినయ విధేయతలు, నీతి నిజాయితీలు, కష్టించి పనిచేసే తత్వం యువకులలో ఉండాలని నెహ్రూజీ చెపుతుండేవారని ఆ లక్షణాలన్నీ శ్రీ కృష్ణారావులో మూర్తీభవించి ఉన్నాయని ఆయన యువతరానికి ఆదర్శప్రాయుడని అన్నారు సమాజానికి చేసిన సేవను ప్రతిభను ....చటం జరుగుతుందనే ఆశ, ధైర్యం ఈ

అభినందన సభ యువతరంలో కలగ గలదని ఆశిస్తూ ఆయన శ్రీ కృష్ణారావు గుణగణాలను ప్రశంసించి అభినందనలు తెలియజేశారు.

ఆర్చి బిషప్ అరుళప్ప

ఆర్చి బిషప్ ఆరుళప్ప క్రైస్తవ స్వచ్ఛంద సేవాసంఘ పక్షాన తమ అభినందనలు తెలియజేస్తూ, శ్రీ మండలి క్లిష్ట సమయంలో దగ్గర ఉండి ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని ఆ.... టమే కాకుండా స్వయంగా వారితోపాటు ఆ కష్ట సుఖాలను పంచుకొన్న వ్యక్తి అని వర్ణించారు. 'ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా ఉన్నప్పుడే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. సమాజంలో ప్రతి ఒక్కడూ సుఖంగా ఉన్నప్పుడే సమాజం సుఖంగా ఉంటుంది' అనే మహానీయుల దృక్పథం శ్రీ కృష్ణారావు గారు చేసే కృషి వెనక సర్వదా తొంగి చూస్తున్నది ఆ అరుళప్ప ప్రశంసించారు శ్రీ కృష్ణారావుగారు మితభాషి. ....కర్తగా అమితోత్సాహి. నిష్కామ కార్యకర్త అనికూడా ప్రశంసించి తను సుభాకాంక్షలు తెలియచేశారు.

శ్రీ అబిద్ ఆలీఖాన్

సియాసత్ పత్రిక సంపాదకులు శ్రీ అబిద్ ఆలీఖాన్ శ్రీ కృష్ణారావుగారి నిస్వార్ధ సేవను ప్రస్తుతించి జంటనగరాల పౌరుల పక్షాన వారికి అభినందనలు తెలిపారు.

శ్రీమతి దుర్గా భక్తవత్సలం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డ్ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గా భక్తవత్సలం తమ ప్రసంగంలో దేశ స్వాతంత్ర్యం రాక పూర్వం స్వచ్ఛంద సంస్థలు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని త్యాగ భావంతో సేవ చేసినాయని, స్వాతంత్ర్యానంతరం అటువంటి సంస్థలకు ప్రభుత్వం నుంచే అంతో ఇంతో ఆర్థిక సహాయం అందుతూ ఉన్నా వాటి కార్యక్రమాలతో పూర్వపు ఉత్సాహం ....వా భావం. కనబడటం లేదని అన్నారు. ఈ పరిస్థితులలో కృష్ణారావు చేసిన సేవ వివిధ స్వచ్ఛంద సంస్థల

కార్యక్రమాల సమన్వయం ఆశాకిరణంగా ఉండగలదని అమె ఆశించారు. శ్రీ మండలి వారు చేసిన కృషిని ఆమె కొనియాడారు.

శ్రీ విశ్వనాధ కృష్ణదేవరాయలు

యు.కె. ఆంధ్ర సంఘం ఆధ్యక్షులు శ్రీ విశ్వనాధ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ తుఫాను, ఉప్పెన వచ్చిన తరువాత కొంత కాలానికి ఒకసారి ఈదేశం వచ్చినప్పుడు చూసిన హృదయ విదారక పరిస్థితులను జ్ఞాపకం చేసుకొని ఆ పరిస్థితులలో గుండె చెదిరిపోకుండా నిలిచి శ్రీ కృష్ణారావుగారు సాధించిన పునర్నిర్మాణ కార్యక్రమ విజయాలను శ్లాఘించారు. ఈవిధమైన సేవ ఏ యితర దేశంలోనో అయితే బహుధా శ్లాఘించటమే కాకుండా ఆ వ్యక్తికి అంతర్జాతీయమైన గుర్తింపు కోసం పత్రికలు, ప్రజలు యత్నించి ఉండేవారని ఆంటూ శ్రీ మండలి వారికి ప్రభాకర్‌జీ అవార్డు మాత్రమే కాక నోబుల్ బహుమతి కూడా రావాలని తమ హార్ధిక అభినందనలు తెలిపారు.

డా॥ బోయి భీమన్న

విధాన మండలి సభ్యులు ప్రముఖ కవులు డా॥ బోయి భీమన్న శ్రీ విశ్వనాధ కృష్ణదేవరాయలు చేసిన సూచనను బలపరుస్తూ శ్రీ కృష్ణారావుగారు మానవతావాది అని వారి పేరు ముందున్న యం.వి. అన్న పొడి అక్షరాల వివరణ మానవతా (యం.) వాది (వి.) అని అన్నారు. ప్రభాకర్‌జీ ఆవార్డు రూపంలో తమకు వచ్చిన నగదు పదివేల రూపాయలను ఈ అవార్డు కొనసాగించే నిమిత్తం విరాళంగా ఇవ్వటంలో కృష్ణారావు గారి ఔదార్యం, నిస్స్వార్థత స్పష్టమౌతున్నాయని డా॥ భీమన్న అన్నారు.

శ్రీ చల్లా కొండయ్య

సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ చల్లా కొండయ్యగారు శ్రీ కృష్ణారావుగారి గుణగణాలను శ్లాఘించి తమ అభివందనలు, ఆశీస్సులు అందచేశారు. ‘‘అధికారంలో ఉన్న వ్యక్తుల చుట్టూ

మూగేవారికి. సన్మానాలు చేసేవారికి కొరతలేదు, ఆ వ్యక్తుల అధికారంతోపాటే అట్టాంటివాళ్ళూ దూరమైపోతూ ఉంటారు. అధికారంలో లేనప్పుడు కూడా ఒక వ్యక్తికి గుర్తింపు, గౌరవము, సన్మానము. అభినందనలు లభిస్తున్నాయంటే అది ఆ వ్యక్తి శీల సంపదను ఔన్నత్యాన్ని సూచిస్తుంది'' అన్నారు శ్రీ కొండయ్యగారు. మహాత్మాగాంధీ, రామకృష్ణ పరమహంస, వివేకానంద ప్రభృతులందరూ మానవ సేవను మాధవ సేవగా గురుతించి తమ జీవితాలను సేవకు అంకితం చేశారు. మనిషి క్రమక్రమంగా తన సేవను కుటుంబం నుండి విశ్వమానవ కుటుంబానికి విస్తృతంచేస్తూ పోతే మానవత్వంలో ఒక్కొక్కమెట్టే ఎక్కుతాడు. లేనిపక్షంలో మానవుడు పశుత్వంలోకి దిగజారిపోతాడు. పదవులవల్ల సిరిసంపదల వల్ల తాత్కాలికంగా సంక్రమించిన గొప్పదనంతో విద్యాహకారం పెంచుకోకూడదు. ఇతరులకు ముఖ్యంగా బాధితులకు, దీనులకు సేవ చేసి వారి కన్నీరు తుడవడంలోనే నిజమైన తృప్తి, చరితార్థత ఉన్నాయి' అని అభిలషిస్తూ నిజమైన సంఘసేవకు, నీతి నిజాయితీలకు శ్రీ కృష్ణారావుని ప్రతీకగా పేర్కొన్నారు. శ్రీ కృష్ణారావు నిర్మలమైన మనస్సుతో సంఘసేవ చేశారని ఆయన చిన్ననాటి నుండి సామ్యవాది అని, సమాజంలో వెనుకబడిన వారికి సహాయపడాలనే మనస్తత్వం కలవారని శ్రీ కొండయ్య అన్నారు. శ్రీ కృష్ణారావు ఇతోధికాయురారోగైశ్వర్యాలతో విలసిల్లి తన జీవితంలో తాను ఏర్పరచుకొన్న లక్ష్యాలను సాధించాలి అని శ్రీ కొండయ్యగారు దీవించారు.

తదనంతరం శ్రీ కృష్ణారావు సముచిత రీతి సమాధానం చెబుతూ పెద్దలు మిత్రులు తమపట్ల చూపిన వాత్సల్యానికి. ఆనురాగానికి కృతజ్ఞత తెలియచేశారు. ప్రభాకర్‌జీ అవార్డునందుకు అభినందన చేయ తలపెట్టినప్పుడు తమకది లేదని అయినా ఇందువల్ల యువతరం వారిలో సామాజిక స్పృహ కలిగే అవకాశం ఉన్నందున వినమ్రతతో అంగీకరింమని శ్రీ కృష్ణారావు అన్నారు. ఆంధ్రతీర ప్రాంతాన్ని 1977 నవంబరులో ప్రాణ నష్టం, ఆస్తినష్టం కలిగించినత ఉప్పెన

కనీవినీ ఎరగనట్టిది. ఆ సమయంలో మరో ఆలోచన లేకుండా సేవలో నిమగ్నము కావడమే జరిగింది. ఆ .... గుర్తించి ప్రభాకర్‌జీ ఆవార్డు నాకు ఇవ్వడానికి నిశ్చయించినందుకు నాకు తృప్తితోపాటు గర్వకారణంకూడాను. అయితే ఈ గుర్తింపు ఈ అవార్డు నా ఒక్కడికే కాకుండా నాతోపాటు పనిచేసిన స్వచ్ఛంద సంస్థలకు, సాంఘిక సేవా కార్యకర్తలకు అనే...... వారి పక్షాన నేను శిరసావహించాను'' అని పేర్కొన్నారు మండలి.

అభినందన సమితి కార్యదర్శి శ్రీ పోతుకూచి సా...... రావుగారు వందన సమర్పణం చేశారు. జాతీయగీతాలతో కార్యక్రమం ముగిసింది.

'ఆర్తజనబంధు' శ్రీ మండలికి విజయవాడ పౌరుల ఘనసన్మానం

కృష్ణామండలం శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు పుట్టి పెరిగిన స్థలం, ఆ జిల్లాలో ఆయన సేవా నిరతితో ప్రజాహితైక చింతనలో ఆదర్శమూర్తిగా నిలిచారు. నిరాడంబరులుగా, పేదల పాలిట పెన్నిధిగా, ప్రజల మనిషిగా శ్రీ మండలి ప్రతి ఒక్కరికి ఆత్మీయులే. ప్రభాకర్‌జీ అవార్డు పొంది 1978లో ఉత్తమ సమాజ సేవకుడుగ గౌరవింపబడిన శ్రీ మండలి వారికి మార్చి 22 వ తేదీన ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నరు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన ఘన సన్మానం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజానీకంతో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలు కిక్కిరిసి పోయింది, విజయవాడ పట్టణంలోని వివిధ సేవా, సాహిత్య, సాంస్కృతిక సంస్థలవారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అభినందన సమితి కన్వీనర్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ స్వాగతం చెప్పారు. శ్రీ బి. ఆర్థర్ పాల్ 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాన్ని ఆలపించారు.

లవణం పరిచయ వాక్యాలు :

ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గోపరాజు లవణం శ్రీ మండలిని పరిచయం చేస్తూ వారి సేవలను ప్రశంసించారు. రాజకీయ నాయకులు సమాజ సేవా తత్పరులయితే రాజకీయాలకు క్షేమం, సమాజానికి క్షేమం, దేశానికి క్షేమమని అన్నారు. రాజకీయాలకు సంఘ సేవగా మలిచే ప్రయత్నంలో శ్రీ మండలి విజయం సాధించారు. పదవి ఉన్నా లేకున్న సమాజ సేవకు అంకితమైన వ్యక్తి శ్రీ కృష్ణారావు. సమాజంలోని సమస్యలపై పదిమంది దృష్టిని మళ్ళించగల శక్తి శ్రీ మండలికి కలదని ఆటువంటి వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు. భారతదేశంలోనే లేరని చెప్పటం అతిశయోక్తి కాదని అన్నారు.

ప్రముఖ కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, కవి సామ్రాట్ శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, శ్రీ పరావస్తు వెంకయ్యసూరి మండలిని ఆశీర్వదిస్తూ పద్యాలను చదివారు.

శ్రీ గుమ్మడి ప్రసంగం :

ప్రముఖ సినీనటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ శ్రీ మండలి కృష్ణారావుగారికి ఇప్పుడు చేస్తున్నది సన్మానమే అయినా ఆ సన్మానం వెనుక ఉన్న ఒక ప్రయోజన మేమంటే తక్కినవారికి సేవాభావాన్ని జ్ఞాపకం చేయడమని అన్నారు. శ్రీ కృష్ణారావుగారితో మాకు పరిచయమైంది వారు మంత్రిగా ఉండగా వారి దగ్గర నుండి ఏదైనా సహాయం పొందాలని వెళ్ళింది కాదు ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కృష్ణారావుగారు మద్రాసు వచ్చి ఇందులో అందరూ పాల్గొనాలి. ముఖ్యంగా నటీనటులు చాలా ప్రముఖపాత్ర వహించనిదే పెద్దకార్య భారం నిర్వహించలేము అని వారు చెప్పారు. అప్పుడు అసోసియేషన్‌కి నేను ప్రధాన బాధ్యత స్వీకరించి ఉండుట వలన వారు చెప్పినదాన్ని మా బాధ్యతగా స్వీకరించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాము. అప్పుడు కృష్ణారావుగారి అసలు రూపం, స్వరూపం, కార్యదీక్ష చూడగలిగాం. కార్యకర్త ఎలా ఉండాలి? ఇతరులచేత ఎలా కార్యం నిర్వహింపచేయాలి అనేది కృష్ణారావుగారిని చూచి నేర్చుకొన్నాం. ఆయన ముఖ్యంగా కార్యకర్త. ఆయన మంత్రి పదవిలో ఉండనీయండి, లేకపోనీయండి, ఆయన కార్యకర్తయే. ఆయన సామాన్యుల్లో సామాన్యుడుగా, పెద్దల్లో పెద్దగా అందరిలో కలిసిపోతారు. నా జీవితాన్ని ప్రభావితం చేసిన వారిలో కృష్ణారావుగారు ఒకరు. రాజకీయ నాయకులంటే ఎలా ఉండాలో, ఎలా ప్రవర్తించాలో, ఎలా మెలగాలో మాకు నేర్పినవారు, చూపించినవారు, ఆదర్శంగా మెలిగినవారు శ్రీ మండలి కృష్ణారావుగారు.

తెలుగు మహాసభల సహాయార్థమై సాంస్కృతిక ప్రదర్శనలకు మేము బయలుదేరితే రాత్రింబవళ్లు మాతోపాటు బస్సుల్లో ప్రయాణంచేసి తెల్లవారు

ఝామున 3-00 గంటల వరకు నాటకాల వద్ద కూర్చొని మళ్ళీ 4-30 గంటలకు లేచి అందర్నీ మమ్ములను కార్యోన్ముఖుల్ని చేసి మరలా 100 మైళ్లు 200 బస్సుల్లో ప్రయాణం చేసి 15 రోజులు అహర్నిశలు వారు పడ్డారు. ఆ కార్యదీక్ష చూస్తే ఎవరికైనా ఉత్సాహం ఉపొంగుతుంది, ఎవరికైనా ఆవేశం కలుగుతుంది. అలాగే దివిసీమ సముద్రుని కోపాగ్నికి గురియై అల్లకల్లోలమైనప్పుడు కృష్ణ గారు ముందుకు వచ్చి అపారమైన సేవ చేశారని శ్రీ గుమ్మడి ప్రశంసించారు.

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి:

సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ప్రసంగిస్తూ ‘‘ఏదైనా పెద్ద విపత్తు వచ్చినప్పుడు ఒక వ్యక్తి కూడ పుడతాడేమో అనుకుంటాను. బీహారులో భూకంపం వచ్చినప్పుడు రాజేంద్రప్రసాద్ తన పూర్తి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు రాజేంద్రబాబు మామూలుగా కా.... వర్కర్, రాష్ట్ర కమిటీ ప్రెసిడెంట్. భూకంపం వచ్చినప్పుడు రాజేంద్రబాబు ఆ బీహారంతా కూడా ఆర్గనైజ్ చేసి, దేశ....... బిక్షాటన చేసి, అ ఆర్తజనుల యొక్క పోషణ, సహాచం చేశాడు. దానికి మదింపుగా ఆ సంవత్సరం భారత కాంగ్రెస్ ప్రెసిడెంట్ పదవి లభించింది అట్లాగే ఏవో విపత్తులు రావాలి, ఒక్కోసారివస్తాయి, మనం వద్దన్నా వస్తాయి. ఆ విపత్తులనుంచి ఏదో మధన క్షీరసాగర మధనంలాగా వస్తుంది. కొంచెం అమృతం కూడా వస్తుంది. కన్నీరు కార్చేనంత మాత్రమే కాదు, గుండె నీరు కార్చేవారు కాదు. సేవానిపునీతమైన హస్తాలతో కొందరు వ్యక్తులు ఆ విపత్తుల నుండి పుడతారు, కన్నీరు కార్చడం తేలికైన పని, ఆందరూ చేస్తారు. కాని స్వయంగా కార్యక్రమంలో పాల్గొని బాధితులకు సహాయం చేసిన వారు కృష్ణారావుగారు.

కృష్ణారావుగారి కార్యదీక్ష ప్రపంచ తెలుగు మహాసభల సందర్భగా స్వయంగా చూశాను. ఎన్నిసార్లు ఎంత ప్రయాణం చేశారో, ఎన్నిసార్లు బెజవాడకు వెళ్ళారో, ఎన్నిసార్లు మద్రాసు వచ్చారో, భువనేశ్వర్ వెళ్ళారో, బెంగుళూరు-పోయినారో ఈమాదిరిగా తెలుగు వారందరిని కలుసుకొని తెలుగు మహాసభలకు

మీరందరూ రావాలని ఆహ్వానించారు. ఉత్తర ప్రత్యుత్తరాల స్వారా విదేశాంధ్రులను పిలిపించారు. ఈ రీతిగా ఒక దీక్షగా, ఒక తపస్సుగా ఆయన చేశారు. ఆయన విద్యామంత్రిగా ఏమి చేశారో నాకు అక్కరలేదు. కాని ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగువారికి ఒక ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం కలుగ చేసినారంటాను. ఆనాడు అంతా సుముఖంగా లేరు, కొంత వ్యతిరేకత ఉండేది, అయినా ముందంజవేసి కొంతదూరం పోయి ....రు, ఆ రీతిగా అది ఒక ఘట్టం. వారు మంత్రిగా చేసిన మహత్తర ఘట్టం.

నేనిక్కడ కూర్చొని ఆలోచిస్తున్నాను మద్రాసులోగాని, హిందూదేశంలోగాని మంత్రి పదవులు వచ్చి 60 ఏళ్లు కావస్తుంది. 1920 డిసెంబరు 15వ తేదీన మొట్టమొదటిసారిగా మంత్రివర్గం ఏర్పడింది. సుబ్బరాయన్‌గారు ముఖ్యమంత్రి, రాజా పానుగల్లు, సర్ కె.వి.రెడ్డినాయుడు గార్లు మంత్రులు, అంతకు ముందు మంత్రిత్వం అన్నమాట లేదు ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్స్ ఉన్నారు, ప్రజాస్వామ్యంలో మొదటిసోపానం ఆ మంత్రివర్గం. ఆనాటి నుండి ఈనాటివరకు ఎందరో మంత్రులయ్యారు, అదృశ్యమైపోయారు. ఈ 60 ఏళ్లుగా కొన్ని వందలమంది మంత్రులయి ఉండవచ్చు. కాని నేను హృదయపూర్వకంగా ఏ మంత్రికైనా నమస్కారం చేస్తానంటే మండలి కృష్ణారావుగారికే చేస్తాను. పానుగల్లు రాజాగారు వాళ్లంతా ఎంతో పెద్ద ఉన్నతమైన మేధావంతులే. సందేహం లేదు. కాని ఒక సేవాధర్మంతో, సేవాధర్మం చేత పునీతమైన హస్తాలతో ఎవరికైన సేవ చేయవలె. ఆర్తజనులకు నేను సంరక్షణంగా ఉండవలె, ఒక దుర్గం మాదిరిగా ఉండవలె అని చెప్పినవారు ఎవరైనా ఉన్నారా అని ఆలోచిస్తున్నాను. వేముల కూర్మయ్య హరిజనుల సంక్షేమానికై కష్టపడ్డాడు. జి. పి. రామస్వామిరెడ్డి ఏవో కొన్ని స్కూళ్లు స్థాపించారు. కానీ నా మట్టుకు నేను వారెవరికీ నమస్కారం చేయటంలేదు. కృష్ణారావుగారికే నమస్కారం చేస్తున్నాను. ఎందుకనంటే ఆయన ఉపన్యాసాలతో లేదా ఏదో పెద్ద కవిత్వంతో ఆర్తిని దీర్చిన వారు కాదు. కష్టపడి కాళ్లు పుళ్లు పడ్డప్పటికీ, మైళ్ళకు మైళ్లు నీళ్లలో పడి నడుస్తూ, ఆ శవాల మధ్య తిరుగుతూ ఆర్తజన సేవ చేశారు. ఆ

మాదిరిగా సేవ చేసిన రాజకీయవాదులు, మంత్రివర్యులు అట్టెమంది మనకు లేరు, కృష్ణారావుగారు కేవలం తుఫానులో సేవవల్లే కాదు, నాకు అంతకు ముందు కూడా కొంత తెలుసు. తూర్పు కృష్ణాకాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఉండేవారు, అప్పుడు ఆయన ఆఫీసును కని పెట్టుకొని ఉండేవారు ఏదో ఒక పనిని అప్పచెప్పితే దానిని క్షుణ్ణంగా చేయాలనే తపన కలవాడు. ఉన్నారు,

మనిషిలో ఒకరకమైన అగ్ని, తహతహ, ఆవేదన ఉన్నప్పుడు ఆవేదనను వారు సేవా ద్వారా తీర్చుకున్నారు. ఆయన కంటే నేను చాలా దినాలు మంత్రి పదవిని అనుభవించాను, అధికారంలో ఉన్నాను అధికారం చలాయించాను. అంతే తప్ప నేను ప్రత్యేకంగా ఈ సేవ చేశానని చెప్పటానికి ఏమీ లేదు. ప్రోత్సహించానే గానీ స్వయంగా చేతులు వంచి వారి కష్టాలు తీర్చినవాడిని కాదు. మదర్ థేరిసాకు భారతరత్న బిరుదమును ప్రధానము చేసిన రోజునే కృష్ణారావుగారిని ఇక్కడ సన్మానించడం సముచితమైనది. ఇది మానవ సేవకు జరుగుతున్న పట్టాభిషేకమని డాక్టర్ గోపాలరెడ్డి అభివర్ణించారు.

అభినందన సమితి పక్షాన శ్రీ గోపాలరెడ్డి శ్రీ మండలికి 'అర్తజన బంధు' అని వ్రాసి ఉన్న మొమెంటో బహూకరించారు. శ్రీ నీలం వీరరాఘవయ్యగారు నూతన వస్త్రాలతో సన్మానించారు, అనేకమంది పెద్దలు శ్రీ మండలిని నూతన వస్త్రాలతో సన్మానించారు.

సభలో శ్రీమతి హేమలతా లవణం, శ్రీమతి రత్నమాల, శ్రీమతి సీతా కామరాజు, యు.కే. ఆంధ్ర అసోషియేషన్ అధ్యక్షులు శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ బి. వి. రంగారావు, ప్రభృతులు ప్రసంగించి శ్రీ మండలి తనకు జరిగిన సన్మానానికి ఉచితరీతిని ....మిస్తూ ప్రజాసేవ కొనసాగించగలనని హామీ ఇచ్చారు జరిగిన ఈ సన్మానం తనకు తోడ్పడిన వేలాది మంది కలలకు చెందుతుందని అన్నారు.

శ్రీ వై, నరసింహారావు వందన సమర్పణ చేశారు.

మచిలీపట్టణంలో దీనజనబంధు శ్రీ మండలి అభినందన సభ

ప్రభాకర్‌జీ అవార్డు గ్రహీత శ్రీ మండలి వెంకట కృష్ణారావుకు మచిలీపట్టణం పురమందిరంలో ది.30-3-1980 వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎన్. మధుసూదనరావు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు.

మంగళ వాయిద్యాల మధ్య శ్రీ మండలి దంపతులను, జస్టిస్ మధుసూధనరావు దంపతులను సభాస్థలికి తీసుకువచ్చారు. శ్రీమతి జంధ్యాల కిరణ్మయి ''మా తెలుగుతల్లికి మల్లెపూదండ'' గీతాలాపనతో సభ ప్రారంభమైనది. అభినందన సమితి కన్వీనర్ శ్రీ చాపరాల బ్రహ్మానందరావు స్వాగతం పలుకుతూ ''శ్రీ మండలికి నేడు జరుపుతున్న అభినందన పరంపర మండలి అభ్యున్నతికి వెలిబుచ్చుకునే సంబరాలేకాని ఆడంబరాలు కావు. శ్రీ మండలి అకుంఠిత సేవా ప్రగతికి నిదర్శనంగా లభించిన ఆవార్డు సాంఘిక సేవలో ఓనమాలు దిద్దుకుంటున్న నేటి యువతరానికి ఆనమాలు కావాలన్నదే మాలక్ష్యం అందుకే ఈ సదస్సు అన్నారు.

అభినందన సమితి పక్షాన నవ్య కవి శ్రీ నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రి అభినందన పత్రం సమర్పించారు. మచిలీపట్టణం రోల్డుగోల్డు కవరింగ్ అసోసియేషన్, ఏ.పి. మున్సిపల్ టీచర్స్ యూనియన్, మచిలీపట్టణం వారు సన్మానపత్రాలు సమర్పించారు.

కులపతి శ్రీమాన్ ఎన్.టి.జి. వరదాచార్యులు సభా ప్రారంభంచేసి శ్రీ మండలి సేవానిరతిని శ్లాఘించారు. కవిపాదుషా శ్రీ పువ్వాడ శేషగిరిరావు, 'అభినవ రామకృష్ణ' శ్రీ ఆద్దేపల్లి లక్ష్మణస్వామి గార్లు మండలిని ఆశీర్వదిస్తూ పద్యాలను చదివారు

పార్లమెంటు సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు ప్రసంగిస్తూ ''ప్రభాకర్‌జీ అవార్డ్ పవిత్రమైనదని అది శ్రీ మండలికి లభించుట సముచితమని పేర్కొన్నారు. శ్రీ

మండలి నిర్వహించిన ప్రజాహిత కార్యక్రమాలను సవిస్తరంగ వివరిస్తూ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి శ్రీ మండలిని "దీనజన బంధువు" అని సంబోధించడం సముచితంగా వున్నదన్నారు.

శ్రీ మండలి సేవాకార్యక్రమాలను ప్రశంసిస్తూ శాసన మండలిసభ్యులు శ్రీయుతులు కొల్లూరు కోటేశ్వరరావు, కమ్మిలి అప్పారావు, డాక్టర్ దాలిపర్తి సుబ్బారావు. జి.వి. గున్నయ్య శెట్టి, వల్లూరి మోజెస్ మోహన్, శ్యామ్యూల్, దైతా మధుసూధనశాస్త్రి, వేమూరి నారాయణశాస్త్రి, నాయుడు నాగేశ్వరరావు, యశోధర ప్రభృతులు ప్రసంగించారు.

దీనజనబంధు శ్రీ మండలి అని వ్రాసి ఉన్న మెమెంటోను జస్టిస్ మధుసూధనరావు ద్వారా అభినందన సమితి శ్రీ మండలికి బహుకరించారు. శ్రీయుతులు సన్నాల వేణుగోపాలరావు చిలుమర్తి వీరాస్వామి (అంబులు) చలమలశెట్టి నాంచారయ్య: గుండా రంగనాయకులు ప్రభృతులు శ్రీ మండలిని నూతన వస్త్రాలతో సన్మానించారు. శ్రీమతి ప్రభావతీ కృష్ణారావును శ్రీమతి చావరాల శ్రీరామమ్మగారు సన్మానించారు.

న్యాయమూర్తి శ్రీ ఎస్. మధుసూదనరావు ప్రసంగం :

సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎస్. మధుసూధనరావు ప్రసంగిస్తూ నిస్వార్ధ ప్రజాసేవకుడైన శ్రీ మండలి తనకు మూడు దశాబ్దాలుగ తెలుసునని ఆయనకు ప్రభాకర్‌జీ అవార్డ్ లభించటం ఆశ్చర్యకర మనిపించలేదని ఆయన అన్నారు. శ్రీ మండలి మానవత వికసించిన మహోన్నత ప్రజా సేవకుడని పదవి వున్నా లేకపోయినా చిన్నతనం నుంచి ప్రజాసేవకు అంకిత మయ్యాడని అందుకే ఆయనకు ప్రజాహృదయంలో శాశ్వత స్థానం లభించిందని అన్నారు.

రాజకీయాలు వాస్తవానికి ప్రజా సమస్యల్ని పరిష్కరించుతూ ప్రజాపాలన న్యాయంగ, సమంజసంగ నడపాలి, కాని "అనాదిగా రాజకీయాల్ని అధికారం

చేపట్టడం కోసమే ఉపయోగిస్తున్నారు. ప్రతి రాజకీయపక్షం వారు అధికారం హా... ద్వారా అధికారాన్ని వినియోగించటం ద్వారా ప్రజలకు చేయగలమని వాగ్దానం చేస్తున్నారు. కానీ శ్రీ మండలి కృష్ణారావు అధికారం ద్వారానే ప్రజలకు సేవ చేయలేదని నిరూపించారు, దివిసీమలో మహావిపత్తు సంభవించిన ఆయన అధికారాన్ని ఒక బంధనముగ భావించి తన మంచిని విని పరిత్యజించారని శ్రీ మధుసూధనరావు ప్రశంసించారు.

దివిసీమ మృత్యుసీమగ మారిననాడు మహావిపత్కర స్థితులలో శ్రీ కృష్ణారావు పునరావాస సౌకర్యాలు కలిగి ధైర్యంగా పూనుకున్నారు. ఒకపక్క మంత్రిపదవి బాధ్యతలను నిర్వహిస్తూ మరోపక్క కష్టాలపాలైన తన ప్రజలకు సహాయం చేయుట కష్టమని భావించి ప్రజాసేవకై తన మంత్రి వదలుకొనుటకు నిశ్చయించుకుని అధికారం ద్వారా ప్రజలకు సేవ చేయగలమనే భావనను తొలగించారని మధుసూధనరావు అన్నారు. జాతీయ భావంతో చేసే సేవకు అధికారం అక్కరలేదని నిజమైన సమాజ సేవకు సమయాలలో అధికారం అడ్డుగోడగ నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం రాకపూర్వం ఆనాది పెద్దలు సేవకు, మానవతా దృక్పధానికి ప్రాముఖ్యత నిచ్చారని, ప్రపంచంలో భారతీయులు త్యాగానికి, నిజాయితికి పేరుపడ్డారని స్వాతంత్ర్యానంతరం త్యాగభావం, నిజాయితీ, సేవాదం లోపిస్తున్నందుకు శ్రీ మధుసూధనరావు విచారం వ్యక్తం ఆలోపాల్ని సరిదిద్దే ప్రయత్నంలో మనం సఫలీకృతుల పోగ, ఇంకా ఎక్కువగుటకు దోహదం చేస్తున్నామని అన్నారు. ఇది రాజ్యాంగలోపం వల్లగాని, చట్ట నిర్మాణంలోని లోసుగులవల్ల గాని జరుగుతున్నది కాదు. కానీ వాటిని అమలు పరచుటలో, ఆచరించుటలో పై లోపాలు ప్రస్ఫుటంగ కానవస్తున్నాయని ఆయన అన్నారు. నేడు సమాజ సేవకులు అరు.... య్యారు. శ్రీ మండలి వంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువతరం సమాజ సేవ దృక్పథంలో పయనించాలని శ్రీ మధుసూధనరావు

అన్నారు. మండలి వంటి సమాజ సేవకుని త్కరించడం మనని మనం సత్కరించుకోవటమని శ్రీ మధుసూదనరావు పేర్కొన్నారు.

తనకు జరిగిన సన్మానానికి శ్రీ మండలి సమాధానమిస్తూ ఆపదలో ఉన్న ప్రజలకు సేవచేసే అదృష్టం తమకు లభించిందని సన్మానానికి, అవార్డులకు ఆశించి చేసిన సేవ కాదని, అయితే ఈ అవార్డు. అభినందన సభ యువతరాన్ని సేవాభావంవైపు మళ్లించడానికి ఉపయోగపడగలదనే ఆశాభావంతో తాను వాటికి అంగీకరించానని అన్నారు. తనకు జరిపిన గౌరవం ఆపద సమయంలో తనకు తోడ్పడిన వేలాదిమంది స్వచ్ఛంద సేవకులకు చెందుతుందని అన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్యక్షులు శ్రీ పి.వి. నారాయణరాజు వందన సమర్పణ చేశారు. కుమారి రజియాబేగం జాతీయ గీతాలాపనతో సభ ముగిసింది.

విశాఖపట్టణములో సన్మాన సభ

ఉత్తమ సమాజ సేవకుడి ప్రభాకర్‌జీ ఆవార్డు అందుకొన్న శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారిని అభినందించటానికి విశాఖపట్టణంలో స్థానిక అభినందనసమితివారు 1980 ఏప్రిల్ 13న సభ ఏర్పాటు చేశారు. సభకు విచ్చేసినప్పుడు శ్రీ కృష్ణారావు దంపతులను అభినందన సమితి సభ్యులు, విశాఖపౌరులు సాంఘిక సేవా కార్యకర్తలు సాంప్రదాయక రీతిలో పూర్ణకుంభంతో మంగళ వాద్యాలతో ఎదుర్కొని స్వాగతం చెప్పారు. ఆ తరువాత వేద పఠనం జరిగినది. అభినందన సమితి కన్వీనరు శ్రీ డి. కొండలరావుగారు స్వాగతవాక్యాలు చెప్పారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ యం.ఆర్. అప్పారావు గారు అధ్యక్షత వహించారు.

శ్రీ అప్పారావుగారు తమ ప్రసంగంలో ప్రపంచంలోని నలుమూలలా ఉన్న తెలుగువారినందరిని ఒక్కచోటికి చేర్చి సమైక్యత సాధించటానికి మెట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలను ఏర్పాటు చేసి జయప్రదంగా నిర్వహించటంలో శ్రీ కృష్ణారావుగారు వహించిన 6 అద్వితీయ పాత్రలను ప్రశంసించారు. 1977 నవంబరులో కోస్తా జిల్లాలలో పెనుతుఫాను ఉప్పెన సంభవించినప్పుడు విపత్తులో ఉన్న ప్రజలకు సేవచేసే నిమిత్తం తమ మంత్రిపదవి వదులుకోవటానికి సిద్ధపడిన త్యాగి, సేవామూర్తి అని శ్రీ అప్పారావు గారు శ్లాఘించారు. అటువంటి వారికి ప్రభాకర్‌జీ అవార్డు అందచేయటం సముచితమైన విషయమని అన్నారు.

విశాఖ పోర్ట్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ ఆర్. శ్రీనివాస్ ముఖ్యఅతిధిగా మాట్లాడుతూ అనేక సాంఘిక సేవాసంఘాలతో కలిసి ఒక ప్రముఖ సమాజ సేవకుని అభినందిస్తున్న పాల్గొన గలగటం మహాభాగ్యమని అంటూ ప్రజల సమస్యలను పరిష్కరించటంలో సంఘ సేవా సంస్థలు ముందుకు వచ్చి చేయవలసిందెంతో

ఉన్నదని చెప్పారు. అట్లా వచ్చిననాడే దేశం అభివృద్ధి చెందగలదని ఆయన అన్నారు.

శ్రీ కృష్ణారావు గారు అధికారం చేజెక్కించు కొ.... ప్రధానంగా నడిచే ఆల్ప రాజకీయాలకు ఆతీతులు అనునిత్యం సేవా నిరతితో, త్యాగంతో నిరంతర కృషిచేసే మహనీడు అని ప్రస్తుతించారు. ఆచార్య బి.వి.ఎస్. పాత్రుడు. సాంఘిక సంక్షేమ మంత్రిగా శ్రీ మండలి నిరుపేద ప్రజలకు అమోఘమైన సేవలను శ్రీ పాత్రుడు వివరించారు. సిద్ధాంత దృక్పథంతో శ్రీ కృష్ణారావుగారు మంత్రిగా విద్యారంగాలలో బహుళ ప్రయోజనకరములైన ఎన్నో చర్యలను తీసుకున్నారని ఆయన అన్నారు.

విశాఖ నాటక కళాపరిషత్తు అధ్యక్షులు, మాజీ విధాన మండలి సభ్యులు అయిన శ్రీ జి. అభ్యుతరామరాజుగారు ప్రసంగిస్తూ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో, అంతర్జాతీయ తెలుగుసంస్థ స్థాపన తెలుగు వారందరి మధ్య భావసమైక్యత సాధించటంలోను శ్రీ కృష్ణారావుగారు వహించిన అతిప్రముఖ పాత్రను గూర్చి వివరించారు. దివిసీమలో 1977 నవంబరు ఉప్పెన తరువాత గాని ఇటీవల ప్రకాశంజిల్లాలో తుఫాను సమయంలోగాని ఆయన చేసిన సేవలు యువతరానికి మార్గదర్శకంగా ఉండగలవన్న ఆశ ఆయన వ్యక్తం చేశారు.

ప్రముఖ న్యాయవాది. లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ డి.వి. సుబ్బారావుగారు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు ప్రముఖ గాంధేయవాదిగా అభివర్ణించారు. శ్రీ కృష్ణారావు గారు నమ్మినదానిని ఆచరించే మనిషి అన్నారు. శాసన సభ్యులు శ్రీ ఆళ్వార్ దాస్ గారు ప్రజాసమస్యలను పరిష్కరించటానికి వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల కృషిని సమన్వయ పరచటంలో శ్రీ కృష్ణారావుగారి పాత్రను ప్రశంసించి ఈ పని నిరంతరాయంగా భవిష్యత్తులో కూడా కొనసాగాలని అన్నారు. శ్రీ కృష్ణారావు గారు సమాజ సంక్షేమ, విద్యారంగాలలో చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఆచార్య శ్రీ కె.వి. రమణ శ్రీ కృష్ణారావుగారి సేవలను ప్రశంసించి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఇదే విధంగా ఆయన జీవితము అమూల్య

సేవలను అందజేయాలన్న శుభాకాంక్షలను వ్యక్తం చేశారు. శ్రీ పి.ఎస్. దీక్షిత్ విపత్కాలంలో శ్రీ మండలి చేసిన నిరుపమానమైన సేవను వివరించి వారు నెలకొల్పి నిర్వహిస్తున్న గాంధీక్షేత్రము సమాజ సేవా కార్యకర్తల శిక్షణ కేంద్రంగా రూపొందాలన్న కాంక్ష తెలియజేశారు.

సమాజ సంక్షేమ మంత్రిగా శ్రీ మండలి వారు సమాజంలోని కాలుష్యాన్ని క్షాళనం చేయటానికి చేసిన కృషిని వివరిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాజెక్టు ఆఫీసరు శ్రీ రామారావు ఆయన సంఘ సంస్కరణాభిలాషను ప్రశంసించారు. అంతర్వర్ణ వివాహాల ప్రోత్సాహానికి శ్రీ కృష్ణారావుగారు ఇచ్చిన ఉత్తరువులను ఆయన పేర్కొన్నారు.

అభినందన సమితి పక్షాన శ్రీ కృష్ణారావుగారికి సన్మానపత్రం సమర్పించారు. 40 పైగా సంస్థలు నూతన వస్త్రాలతో ఆయనను సత్కరించారు.

శ్రీ కృష్ణారావుగారు సమాధానం చెబుతూ ప్రభుత్వం ఒక్కటే సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటే సాధ్యంకాదని, స్వచ్ఛంద కార్యకర్తలు సంస్థలు ముందుకు వచ్చి సంఘటిత కృషిచేయవలసిన అవసరం ఉన్నదని అన్నారు. అటువంటి కార్యకర్తలకు సంస్థలకు సరియైన ప్రోత్సాహం లభించటం లేదని, అందుచేత స్వాతంత్ర్యానంతరం యువతరంలో నిస్స్వార్థ సేవానురక్తి, త్యాగభావం సన్నగిల్లుతున్నాయని ఆయన అన్నారు. తమకు ప్రజలు ఇచ్చిన గుర్తింపు యువతరంలో సంఘసేవ పట్ల ఆసక్తిని పెంపొందించటానికి తోడ్పడగలదనే దృష్టితోనే ఈ సభలో పాల్గొని అభినందనలు అందుకోవటానికి తాము సిద్ధపడినట్లు ఆయన తెలిపారు.

పోర్ట్ ట్రస్ట్‌లోని నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్... శ్రీ సి.హెచ్. సన్యాసిరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

తిరుపతిలో అభినందన సభ

తిరుపతిలోని 15 సంస్థల వారు కలిసి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారిని అభినందించటానికి ఏప్రిల్ 205 సభ ఏర్పాటు చేశారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సిండికేట్ మాజీ సభ్యులు శ్రీ యం. బలరామరెడ్డిగారు ఆధ్యక్షత వహించారు.


మాజీ పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ పి. మానిరెడ్డిగారు మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాటం జరుగుచున్న రోజులలో విద్యార్థి పాల్గొన్న నాటి నుంచి శ్రీ మండలి వారితో తమకుగల పరిచయాన్ని వివరించారు. శ్రీ కృష్ణారావుగారు అసలైన గాంధేయవాది అన్నారు ఆయన.

మొదటి ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగువారందరినీ సన్నిహితం చెయ్యటంలో శ్రీ కృష్ణారావుగారు సాధించిన ఘనవిజయాన్ని ఆం.ప్ర. సంగీతనాటక అకాడమీ సంయుక్త కార్యదర్శి శ్రీ కృష్ణంరాజుగారు ప్రస్తుతించారు.

శ్రీ యస్. వరదాచారిగారు పెనుతుఫాను, ఉప్పెన కోస్తా జిల్లాలలో విలయతాండవం చేసిన ఆ రోజులలో దీనులకు బాధితులకు శ్రీ కృష్ణారావుగారు చేసిన అపారమైన, నిస్వార్థమైన ఇంకా ఎన్నో అవార్డులు వారికి రావలసి ఉంటుంది అని అన్నారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్.ఎస్. డైరెక్టర్ శ్రీ ఎం.డి. నారాయణ నాయుడు వయోజనవిద్యాలయమై, ఎన్.ఎస్.ఎన్. కార్యకలాపాల విషయమై శ్రీ రావుగారికి ఉన్న ఆసక్తిని వివరించి చెప్పారు.

ఉన్నతస్థాయికి చెందిన ప్రముఖ సాఘిక సేవా కార్యదర్శి శ్రీ మండలి గుణగణాలను ప్రశంసిస్తూ డా॥ పి.వి. అరుణ కవిత వ్రాసి శ్రీ మండలివారి బహుముఖ సేవలను ప్రశంసించగా పలువురు వక్తలు ప్రసంగించారు. తిరుమల తిరుపతి దేవస్థాన ప్రజాసంబంధాల అధికారి శ్రీ రావుల సూర్యనారాయణ, శ్రీ బాడాల కృష్ణమూర్తి, డా॥ శ్రీధరబాబు, చిత్తూరు .... కళాక్షేత్రం, రామవిలాససభ, రాయలసీమ ట్రేడ్ యూనియన్ పక్షాన శ్రీ చెన్నకేశవరెడ్డి, డా॥ వేణుగోపాల్, తిరుపతి పక్షాన డా॥ యన్.వి. రామకృష్ణ, శాంతినగర్ కల్చరల్ అసోసియేషన్ పక్షాన శ్రీ అచ్చన్న శాస్త్రి, రసధుని సమాఖ్య శ్రీ పి.ఎస్.వి. ప్రసాదరావు ప్రసంగించారు.


Prabhakarji Awar
BEST SOCIAL WORKER 1978
M.V. Krishna Rao